RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త


తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 201 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 ఆగస్టు 2024 మంగళవారం పేజీలు : 4

## పాంగాంగ్ వద్ద చైనా తవ్వకాలు

న్యూఢిల్లీ : తూర్పు లద్దాక్‌లోని పాంగాంగ్ సరస్సు వద్ద భారీ బంకర్లు నిర్మించేందుకు చైనా సైన్యం చాలా లోతుగా తవ్వుతున్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆయుధాలు, ఇంధనం నిల్వచేయడంతోపాటు, సాయుధ వాహనాలకు పటిష్ఠమైన షెల్టర్లుగానూ వీటిని ఉపయోగించుకో నున్నట్టు భావిస్తున్నారు. పాంగాంగ్ సరస్సు ఉత్తర దిక్కున పర్వతాల మధ్య సిర్జాప్ ప్రాంతంలో చైనా సైన్యం పీఎల్‌ఏ(ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) ప్రధాన స్థావరం ఉంది. పాంగాంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించిన డ్రాగన్ సైన్యానికి అదే ప్రధాన కార్యాలయం. దానిని వాస్తవాధీన రేఖకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అది భారతదేశ భూభాగమని భారత్ వాదిస్తోంది.




# జాతీయ స్థాయిలో చంద్రబాబు వ్యూహం..

# తెలంగాణపై ప్రత్యేక ఫోకస్..!

హైదరాబాద్ / అమరావతి : రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారానికి రావడంతో టీడీపీకి మరింత ఊపునిచ్చింది. ఇదే ఒరవడితో తెలంగాణలోనూ పాగా వేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. భాషాపరంగా పార్టీ విస్తరణకు అవకాశం ఉన్నది కూడా అక్కడే. ప్రస్తుతం కేంద్ర సర్కారు ఏర్పాటు లో టీడీపీ కీలక పాత్ర పోషించిన అత్యధిక ఎంపీలున్నా రాష్ట్రాలకు దక్కిన ప్రాధాన్యం రాష్ట్రానికి అంతగా లేదు. ఇప్పటికే నిధుల కేటాయింపులో బీహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు ఇస్తున్న ప్రాధాన్యత రాష్ట్రానికి దక్కడం లేదు. రాష్ట్రానికి గ్రాంట్ల రూపంలో సాయం అందించడానికి బదులు అప్పులకు అనుమతులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

**క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి...** భవిష్యత్తులో ఎంత ఎక్కువ మంది ఎంపీలుంటే కేంద్రంలో అంతటి పలుకుబడి ఉంటుందని సీఎం చంద్రబాబు గ్రహించినట్లుంది. ఈపాటికే తెలంగాణలోని కొన్ని దక్షిణ జిల్లాలో టీడీపీకి పట్టుంది. దీన్ని రాష్ట్రమంతటా విస్తరించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా బీసీలు, యువత, సెటిలర్స్‌పై దృష్టి సారించనున్నారు. మొన్నామధ్య చంద్రబాబు అరెస్టు సమయంలో హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి.

దీన్ని దృష్టిలో ఉంచుకొని 2028 ఎన్నికల నాటికి తెలంగాణలో పచ్చ జెండా రెపరెపలాడించాలని భావిస్తున్నారు.

**2028 నాటికి తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యం..** తెలంగాణలో బీఆర్ఎస్ ?ఇప్పట్లో పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు. బీజేపీతో దాగుడుమూతలు ఆడిన ఫలితంగా ఆ పార్టీ కోలుకోలేకపోతోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎదురు దాడి చేయడం కన్నా క్షేత్ర స్థాయి నుంచి పార్టీ నిర్మాణంపైనే దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారు. ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసిన తర్వాత తగు నిర్ణయం తీసుకోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో టీడీపీ కొన్ని ఎంపీ సీట్లు సాధించినా కేంద్రంలో చక్రం తిప్పే అవకాశాలున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి సీఎం చంద్రబాబు పూర్తిగా జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.



బతుకమ్మ పండుగకు ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్

## రేవంత్ సర్కార్ బతుకమ్మ పండుగ కానుక అదరహో..

బతుకమ్మ పండుగ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తెలంగాణలోని ప్రముఖ పండుగల్లో ఇది కూడా ఒకటి. బతుకమ్మ పండుగ దగ్గరకు వస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ఫెస్టివల్‌కు మహిళలకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండుగ వస్తోందంటే మహిళలకు చీరలు అందించేది. ప్రతి సంవత్సరం బతుకమ్మకు ప్రభుత్వం నుంచి మహిళలకు చీరలు వస్తూనే ఉండేవి. అయితే ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఆలోచిస్తోంది. గతంలో బీఆర్ఎస్ ఇచ్చే బతుకమ్మ చీరలపై పలు విమర్శలు వచ్చేవి. చీరలలో నాణ్యత లేదని మహిళలు విమర్శించిన ఘటనలు మనం చూసే ఉంటాం. అయితే ఈసారి మాత్రం ఇలా జరగకుండా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటోంది.రేవంత్ రెడ్డి సర్కార్ ప్రస్తుతం చీరలు పంపిణీ చేయవద్దనే నిర్ణయానికి వచ్చింది. అంటే బతుకమ్మ చీరలు ఉండకపోవచ్చు. మరీ చీరలు లేకపోతే ఎలా? మహిళలకు ఏం ఇస్తుంది? బతుకమ్మ చీరలు బదులుగా మహిళలకు పండుగ కానుకగా ఏం ఇస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలకు ఏదైనా బహుమతి ఇవ్వాలా? లేదంటే నగదు రూపంలో అందించాలనే అనే అంశాలపై చర్చ జరుగుతున్నట్లు సర్వత్రా వినిపిస్తోంది.

## యువత దేశానికి మార్గనిర్దేశకులుగా మారాలి

హైదరాబాద్: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్ర యువతీ యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. రేపటి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ యువత సన్మార్గంలో పయనిస్తూ దేశానికి మార్గనిర్దేశకులు కావాలని ఒక సందేశంలో ఆకాంక్షించారు. తెలంగాణ యువత రాణించేలా ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్యాచరణ తీసుకుందని సీఎం తెలిపారు. పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీతో పాటు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం, పెడదారులను నియంత్రిస్తూ క్రీడల పట్ల ఆసక్తి పెంచడం తదితర నిర్ణయాలు అందులో భాగమే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**పెట్టుబడుల కోసం సౌత్ కొరియాకు రేవంత్ టీం..** మరోవైపు.. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం చేపట్టిన విదేశీ పర్యటన విజయవంతంగా సాగుతోంది. ప్రస్తుతం ఆయన అమెరికా పర్యటన ముగించుకొని సౌత్ కొరియాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అడుగుపెట్టారు. పది రోజుల ప్రణాళికలో భాగంగా ఏడు రోజుల పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. రేవంత్‌తో పాటు సౌత్ కొరియాకు మంత్రి శ్రీధర్ బాబు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి సైతం వెళ్లారు.

అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసినట్లు రేవంత్ పేర్కొన్నారు. అమెరికాకు సరికొత్త తెలంగాణను పరిచయం చేశామని రేవంత్ తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన భారీ అమెరికా కంపెనీలు ముందుకొచ్చాయని తెలిపారు.

## టీడీపీలోకి కూకట్ పల్లి ఎమ్మెల్యే.. షాక్ లో కేసీఆర్?



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీకి ఎంతటి క్రేజ్ ఉండేదో ప్రతీ ఒక్కరికీ తెలిసిందే. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో ఉన్న పలువురు కీలక నేతలు టీడీపీకి చెందిన వారే ఉండటం గమనార్హం. సీఎం రేవంత్ రెడ్డి కూడా తెలుగు దేశం పార్టీ నుంచే కాంగ్రెస్ పార్టీలో చేరి సీఎం అయ్యారు. తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పావులు కదుపుతున్నారు. మొన్న ఎన్టీఆర్ భవన్ లో పలువురు కీలక నేతలతో భేటీ అయ్యారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారి దర్శనాలకు తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడు కూడా సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. మరోవైపు టీడీపీలోకి కూకట్ పల్లి ఎమ్మెల్యే వెళుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు టీడీపీలోకి వెళ్లితే కేసీఆర్ కి షాక్ అయితే తప్పదు అని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# పదవుల భర్తీ ఇక పూర్తయినట్లే!

## ఈ మాసంలోనే పీసీసీ చీఫ్ - మంత్రి వర్గ విస్తరణ



హైదరాబాద్ : ఈ శావణమాసంలో కాంగ్రెస్ హై కమాండ్ నేతలకు గుడ్‌న్యూస్ చెప్పనున్నది. ఈ నెలలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని గాంధీభవన్ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. వీటితో పాటు పీసీసీ అధ్యక్ష ఎంపిక, మిగిలిన నామినేటెడ్ పోస్టులు సైతం శ్రావణమాసంలోనే భర్తీ చేసే చాన్స్ ఉన్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ సారి కొత్తగా రైతు, విద్యా కమిషన్లకూ చైర్మన్లు నియమించనున్నారు. వీరి పేర్లు ఇప్పటికే ఫైనల్ అయినట్టు సమాచారం. పార్టీలో పదవులు ఫిలప్ చేస్తుండడంతో ఆశావహులు ఇప్పటికే ఢిల్లీ బాట పట్టారు. మరి కొందరు తమ పేర్లు పరిశీలించాలని హైకమాండ్‌కు లేఖలు రాస్తున్నారు. సీఎం రేవంత్ అమెరికా టూర్ ముగియగానే ఈ పదవులన్నింటికీ భర్తీ వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

**ఇప్పటికే పేర్లు ఫిల్టర్ ?...** మంత్రివర్గ విస్తరణతో పాటు పీసీసీ కొత్త ప్రెసిడెంట్, వివిధ కమిషన్లు, కార్పొరేషన్ల చైర్మన్‌ల పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ కొన్ని పేర్లను ఫిల్టర్ చేసినట్లు సమాచారం. ఆయా లీడర్ల గురించి ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్ రెడ్డి టీమ్ అన్ని జిల్లాల్లోని గ్రౌండ్ లెవల్ నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నది. సీఎం కూడా కొన్ని పేర్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, ఏఐసీసీ అనుమతి కోసం ప్రపోజల్స్ ఢిల్లీకి పంపినట్లు తెలిసింది. సీఎం రాగానే మరోసారి ఢిల్లీ పెద్దలతో చర్చించిన తర్వాత వరుసగా పదవుల ప్రకటన ఉంటుందని ఓ కీలక నేత వివరించారు. ఇక కార్పొరేషన్ పదవులు దక్కించుకునేందుకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలతో పాటు, ఏఐసీసీ హామీలిచ్చిన లీడర్లు పోటీ పడుతున్నారు. మరోవైపు మంత్రి వర్గ విస్తరణలో ఖాళీగా ఉన్న ఆరు బెర్త్‌ల కోసం సుమారు 10 మంది ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ గట్టిగానే ట్రై చేస్తున్నారు. బీసీ కోటాలో బీర్ల ఐలయ్య, వాకిటి శ్రీహరి, ఎస్సీ కోటాలో వివేక్ వెంకటస్వామి, గడ్డం లక్ష్మణ్, రెడ్డి సామాజిక వర్గం నుంచి సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి, రంగారెడ్డి, వెలమ నుంచి ప్రేమ్ సాగర్‌రావు, లంబాడా సామాజిక వర్గం నుంచి బాలు నాయక్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు మైనార్టీ కోటాలో తనకు ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ సైతం తనదైన శైలీలో ప్రయత్నిస్తున్నారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లో తనకు చాన్స్ ఇవ్వాలంటూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న దానం నాగేందర్ హైకమాండ్‌ను కోరుతున్నారు. అయితే ఏఐసీసీ ఎవరికి ప్రమోషన్ కల్పిస్తుందనేది? త్వరలోనే తేలనున్నది.

**పీసీసీ అధ్యక్ష రేసులో ఆ ఇద్దరు..** టీపీసీసీ అధ్యక్ష ఎంపిక సైతం దాదాపు ఖరారైనట్టు తెలుస్తున్నది. ఫైనల్ స్టేజ్‌లో ఎస్టీ సామాజిక వర్గం నుంచి బలరామ్‌నాయక్, బీసీ నుంచి మహేశ్‌కుమార్ గౌడ్ పేర్లు ఉన్నాయని, హైకమాండ్‌దే తుది నిర్ణయమని టీపీసీసీ సభ్యుడు ఒకరు తెలిపారు. ఈ ఇద్దరూ ఢిల్లీలో గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్టీ లంబాడాకు పీసీసీ పదవి ఇవ్వలేదని, ఈ సారి ఆ అవకాశం తనకు కల్పించాలని బలరామ్ నాయక్ కోరుతున్నారు. ఇక తాను 35 ఏళ్లుగా పార్టీలో విధేయుడిగా వివిధ హోదాల్లో పని చేశానని, తనకే పీసీసీ పదవి ఇవ్వాలని మహేశ్‌కుమార్ గౌడ్ ప్రయత్నాల్లో ఉన్నారు. ఆయన పారిస్ వెళ్లేకంటే ముందు మూడు రోజుల పాటు ఢిల్లీలోనే మకాం వేసినట్లు తెలిసింది. మరోవైపు ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ సైతం పీసీసీ పదవి కోసం అగ్రనేతల చుట్టూ తిరుగుతున్నట్టు సమాచారం. అయితే పీసీసీ అధ్యక్షుడితో పాటు కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్‌లను ఏఐసీసీ ప్రకటించే అవకాశం ఉన్నది. మరి ఏయే పదవులు ఎవరికి వరిస్తాయో అనేది చూడాల్సి ఉన్నది.

**ఆ ముగ్గురి పేర్లు దాదాపు ఫైనల్..?...** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫస్ట్ టైమ్ అందుబాటులోకి తీసుకురానున్న రైతు, విద్యా కమిషన్లకూ చైర్మన్లను నియమించనున్నారు. రైతు కమిషన్‌కు కాంగ్రెస్ సీనియర్ లీడర్ కోదండరెడ్డి, విద్యా కమిషన్‌కు రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్లు దాదాపు ఫైనల్ అయినట్టు సమాచారం.

ఒక్కో కమిషన్‌కు నలుగురు మెంబర్లు చొప్పున ఈ రెండింటి కోసం 8 మందికి సభ్యుల హోదా ఇవ్వనున్నారు. దీంతో పాటు వచ్చే నెలలో ఖాళీ కానున్న బీసీ కమిషన్‌నూ భర్తీ చేయనున్నారు.

దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత జి.నిరంజన్ పేరు దాదాపు ఫైనల్ అయినట్టు తెలుస్తోంది. ఈ కమిషన్‌లోనూ కొత్త మెంబర్లు రానున్నారు. అంతేగాక సమాచార హక్కు, హ్యూమన్ రైట్స్ కమిషన్లను కూడా ఈ నెలలోనే భర్తీ చేయాలని పార్టీ ప్లాన్ చేస్తున్నది.

# సంపాదకీయం

## బంగ్లా ఎఫెక్ట్ : తెర పైకి హిందూ రాష్ట్ర డిమాండ్ ?

దేశంలో హిందూ రాష్ట్ర డిమాండ్ మరోసారి పురుడు పోసుకుంటోంది. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం ట్యాగ్ భారత్ కి ఉంది. దాంతో పాటు అతి పెద్ద హిందూ దేశం గానూ భారత్ కి గుర్తింపు ఉంది. మొత్తం 143 కోట్ల మంది భారతీయులలో వంద కోట్ల దాకా హిందువులు ఉన్న దేశంగా ఉంది. ఇక భారత్ తరువాత నేపాల్ హిందూ దేశంగా ఉండేది. కానీ అక్కడ వామపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి సెక్యూలర్ బాట పట్టించాయి. తిరిగి హిందూ దేశంగా నేపాల్ ని గుర్తించాలని డిమాండ్ ఉంది. ఇక పోతే భారత్ పొరుగు దేశాలలో హిందువులకు ఎలాంటి రక్షణ లేదు అన్నది పాకిస్తాన్,ఆఫ్ఘనిస్తాన్ లో జరిగే నరమేధాలు రుజువు చేశాయి. బంగ్లాదేశ్ లో హిందువులు ఈ మధ్య దాకా ప్రశాంతంగానే ఉన్నారు. పైగా ఒక ముస్లిం దేశంలో అత్యధిక శాతం అంటే 12 శాతం హిందువుల జనాభా ఉన్నది బంగ్లాదేశ్ లోనే. అయితే షేక్ హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్ లో హిందువులు నరకం చూస్తున్నారు. విద్యార్థులు రిజర్వేషన్ల కోసం లేవనెత్తిన ఉద్యమాన్ని మత చాందసవాదులు హైజాక్ చేసి హిందువుల మీద పడ్డారు. వారి మాన ధన ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దాంతో ఎక్కడ చూసినా దారుణమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు హిందువులు అక్కడ బిక్కుబిక్కుమంటున్నారు. దాంతో వారంతా ధైర్యం కూడదీసుకుని ఈ నెల 9న బంగ్లా వీధుల్లోకి వచ్చారు. లక్షలాది మంది హిందువులతో అతి పెద్ద ర్యాలీ నిర్వహించారు. సుప్రీంకోర్టుతో పాటు అన్ని ప్రభుత్వ భవనాలను హిందూ జనాలు దిగ్బంధనం చేశారు. తమను తామే రక్షించుకుంటామని అంటున్నారు. ఒక విధంగా బంగ్లాలో హిందువులు తెగువ చూపించారు. ఈ నేపథ్యంలో సెక్యులర్ దేశంగా ఉన్న భారత్ లో హిందువులు ఈ రోజుకు బాగానే ఉన్నా రానున్న దశాబ్దాలలో పరిస్థితి ఏమిటి అన్న చర్చ అయితే సాగుతోంది. ఎక్కడైతే హిందువులు మైనారిటీలుగా మారుతారో అక్కడ వారు నరకం చూస్తారని పొరుగు దేశాలు నేర్పిన గుణపాఠం అని భారదేశంలోని హిందూత్వ వాదులు అంటున్నారు. అత్యధిక శాతం హిందువులు ఉన్న ఏకైక దేశంగా భారత్ ఉన్నపుడు హిందూ దేశంగా ప్రకటించి హిందువులను పరిరక్షించుకునే చర్యలు ఇప్పటి నుంచే ఎందుకు చేపట్టకూడదు అని హిందూ సంస్థల నుంచి మెల్లగా డిమాండ్ బయల్దేరింది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. ఆ పార్టీ నినాదం హిందూత్వనే. కానీ మూడవసారి సొంత మెజారిటీతో బీజేపీ అధికారంలోకి రాలేదు. జేడీయూ టీడీపీ మద్దతుతో అధికారం చలాయిస్తోంది. గత రెండు సార్లూ పూర్తి మెజారిటీ ఉండడంతో తాను అనుకున్న కొన్ని పనులను చేయగలిగింది. ఈసారి 400 ఎంపీ సీట్లు అన్న టార్గెట్ తో బరిలోకి దిగినా కూడా చివరికి దక్కింది 240 సీట్లు మాత్రమే. దీంతో బీజేపీ ఈ అయిదేళ్ళూ అధికారాన్ని కాపాడుకోవడం మీదనే దృష్టి పెట్టాలి తప్ప హిందూత్వ అంటూ సున్నిత అంశాల మీదకు వెళ్ళకూడదని అంటున్నారు. మరో వైపు చూస్తే సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అని బీజేపీ ఎంత నినదించినా ఓట్లూ సీట్లు ఏ మాత్రం పెరగడం లేదని పైగా విపక్షాలు బలపడుతున్నాయని అంటున్నారు. దాంతో కాషాయ శిబిరంలో మథనం మొదలైంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హిందూత్వ నినాదాన్ని ఎత్తుకోవాలని కూడా పార్టీలో చర్చ సాగుతోందని అంటున్నారు. అలా ఒక టెస్ట్ గా హిందూత్వను మళ్లీ పదును పెడితే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కనుక దక్కితే అపుడు భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేయవచ్చు అని అంటున్నారు. పైగా ఇపుడు బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో హిందూత్వ నినాదం ఎత్తుకుంటే రాజకీయంగా బలంగా ఉంటుందని కూడా యోచిస్తున్నారుట. ఏది ఏమైనా బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఉన్నపుడే హిందూ దేశంగా ప్రకటించేలా చేసుకోవాలని హిందూత్వ సంస్థలు ఆరాటపడుతున్నాయి. మరి దానికి రాజకీయ బలం ఎంతవరకూ సరిపోతుంది అన్నది కూడా చూడాల్సి ఉంది.

## ఐదు రోజుల్లోనే భారీ చోరీని చేదించిన షామీర్పేట పోలీసులు...

### అడ్డదారిలో ఆర్జించాలనే దురాశతో జైలు పాలయ్యారు.... దొంగల నుండి సుమారుగా 70% సొత్తు రికవరీ మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి....




శామీర్ పేట (గరుడ వార్త) : అడ్డదారుల్లో ఒకే దెబ్బకు జీవితంలో సెటిల్ అవ్వాలని దురాశతో, బంగారం షాపులో దొంగతనానికి భరితగించి... పోలీసులకు చిక్కిన రాజస్థాన్ యువకులు. మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.... రాజస్థాన్ కు చెందిన ఇద్దరు శంకర్ సింగ్ లు ఏ2, %a%3 అడ్డదారుల్లో ఒకే దెబ్బకు ధనవంతుల అవ్వాలని దురాశతో నగరానికి వచ్చి కొంపల్లిలో డ్రైవర్లుగా ఉద్యోగం చేస్తూ రెక్కీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే %a%1 మరియు ఏ ఫోర్ ను సైతం ఈ దొంగతనంలో వారితో పాటు చేతులు కలిపారని తెలిపారు. అందులో భాగంగానే షామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని, తూముకుంట రాజీవ్ రహదారి ఆనుకొని ఉన్న శ్రీకృష్ణ జ్యువెలర్స్ బంగారం లోకి ఈనెల నెల ఆరో తేదీ అర్ధరాత్రి, ఏడవ తేదీ తెల్లవారుజామున గ్రిల్స్, షట్టర్ తాళాలు విరగొట్టి దుకాణ లోపలికి చొరబడి, షాపులో ఉన్న సుమారు 18 లక్షల విలువైన బంగారం మరియు వెండిది దొంగలించారని తెలియజేశారు. దీంతో షామీర్పేట పోలీసులు తో పాటుగా సిసిఎస్ పోలీసులు, డిటెక్టివ్ డిసిపి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కృష్ణ జ్యువెలరీస్ లో దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరు దొంగలను పట్టుకున్నట్లుగా డీసీపీ తెలిపారు. వారి పేర్లు శంకర్ సింగ్ జలం సింగ్, ఇక మరో ఇద్దరు నిందితులైన హనుమంత్ సింగ్, శంకర్ సింగ్ పరారీలో ఉన్నారని వారిని కూడా వీలైనంత త్వరలో పట్టుకుంటామని డిసిపి కోటిరెడ్డి తెలిపారు. ఇక చోరీ జరిగిన సొత్తులో సుమారు 70% శాతం రికవరీ చేసినట్లుగా డీసీపీ తెలిపారు. అంతేకాకుండా వీరు దొంగతనం చేసేందుకు గాను ఓ పల్సర్ బైకులు సైతం దొంగిలించినట్లుగా డీసీపీ తెలిపారు. కాకపోతే ప్రస్తుతం అదుపులో ఉన్న ఇద్దరు పైన గతంలో




ఎటువంటి నేరాలు పాల్పడినట్లుగా సమాచారం లేదని, అదే విధంగా మరో ఇద్దరు పరారోల్లో ఉన్న నిందితుల్లో పై కూడా గతంలో నేరాలు పాల్పడినట్లుగా ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని తెలిపారు. ఏదిఏమైనాప్పటికీ యువత కష్టపడి తమ తెలివితో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు సాగాలే తప్ప దురాశతో దొంగతనాలకు పాల్పడితే, ఎంతటి వారి కైనా చెరసాల తప్పదని గుర్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలు ఆధారంగా కేసును చేదించినట్లు వివరించారు. వీరి వద్ద నుంచి 11.5 తులాల బంగారం, 46 కిలోల వెండి, ఒక పల్సర్ బైక్, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ కోటిరెడ్డి చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ క్రైమ్ డిసిపి నరసింహులు, పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు, శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ర్యాగింగ్ కు పాల్పడితే తగిన చర్యలు తప్పవు




శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ వాస్తవాలను స్తుతి మెత్తగా సూచించారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట పరిధిలోని ఐపిఈ కళాశాలలో యాంటి ర్యాగింగ్ కంపెయిన్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ర్యాగింగ్ చట్టం కింద కేసులు నమోదైన విద్యార్థులు భవిషత్తులో ఎటువంటి ఉద్యోగానికి అర్హులు కాలేరని తెలిపారు. ర్యాగింగ్ కు పాల్పడిన విద్యార్థులపై నాన్బెయిలబుల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడినట్లయితే కళాశాల ర్యాగింగ్ కమిటీకి, కళాశాల యాజమాన్యందృష్టికి, పోలీస్ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రశాంతమైన కళాశాల వాతావరణం లో చదువుకోని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ,సమాజానికి మంచి పేరు తెచ్చే పౌరులుగా



ఎదగాలని సూచించారు. అనంతరం ఈ ఈనెల 29న కళాశాలలో జరగనున్న స్పోర్ట్స్ మీట్ లోగో, పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీకాంత్, ప్రొఫెసర్ రాజ్ కుమార్ పిళ్లై, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత ఉద్యోగం కన్నా, ఉద్యోగ కల్పన దిశగా ముందుకు సాగాలి: ఎంపీ ఈటెల



శామీర్ పేట, (గరుడ వార్త) : యువత ఉద్యోగ ప్రయత్నం కన్నా ఉద్యోగ కల్పన దిశగా ముందుకు సాగాలని మల్కాజ్గిరి పార్లమెంటు ఎంపీ ఈటెల రాజేందర్ ఆకాంక్షించారు.

శామీర్ పేట మండలం అలియాబాద్ కు చెందిన శంకర్ గుప్తా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వాసవి ఎలక్ట్రానిక్స్ అండ్ మొబైల్స్ షోరూంను ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ యువకులు ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి చెందాలని చెప్పారు.

ఉద్యోగాల కోసం సమయం వృధా చేయకుండా సొంతంగా వ్యాపారాలు చేస్తూ అభివృద్ధి చెందుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, బిజెపి నాయకులు హృదయ్ కుమార్, బుద్ధి శీను, యాదగిరి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇక రయ్ రయ్

నిజామాబాద్ :జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా నిజామాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగ్దల్‌పూర్ వరకు ఉన్న జాతీయ రహదారి 63 విస్తరణ పనులు ఇక వేగాన్ని అందుకోనున్నాయి. మోదీ 3.0 వంద రోజుల ప్రణాళికలో దేశవ్యాప్తంగా మూడు వేల కిలోమీటర్ల రహదారులకు మోక్షం కలగనుండగా అందులో మన రాష్ట్రానికి చెందిన ఆర్మూర్– క్యాతనపల్లి యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టు, జగిత్యాల–కరీంనగర్ నాలుగు వరుసల రహదారులు కూడా ఉండటం విశేషం. నిజామాబాద్– జగ్దల్‌పూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించే ఈ రహదారి జిల్లాలో దండేపల్లి మండలం గూడెంలో ప్రారంభమై క్యాతనపల్లి వరకు కొనసాగనుంది. ఆర్మూర్– క్యాతనపల్లి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇప్పటికే సర్వే పూర్తి కాగా భూసేకరణ పనులు పూర్తి కావొస్తున్నాయి. తాజాగా కేంద్రం యుద్ధ ప్రాతిపదికన చేపట్టే ప్రాజెక్టుల్లో ఈ రహదారికి కూడా చోటు దక్కడంతో జాతీయ రహదారికి రాజయోగం పట్టనుంది.

మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ

దశాబ్దాలుగా రహదారి విస్తరణ ప్రతిపాదనలు జరుగుతున్నా ఇప్పటివరకు అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం అధికారులు ప్రతిపాదిస్తున్న విధానంలో మంచిర్యాల జిల్లాలో గూడెం గోదావరి తీరం నుంచి క్యాతనపల్లి వరకు పొలాల గుండా వెళ్లనుండటంతో నిర్మాణ వ్యయం తక్కువగా ఉండటంతో పాటు అభ్యంతరాలకు పెద్దగా అవకాశం ఉండదు. దీంతో పనులు వేగంగా జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి. రహదారి నిర్మాణ పనులు పూర్తయితే నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లా వాసులకు రవాణా సౌకర్యాలు మెరుగయ్యే అవకాశాలు ఉన్నాయి.

రహదారుల అనుసంధానం

నిజామాబాద్ – జగ్దల్‌పూర్ జాతీయ రహదారిలో భాగంగా నిర్మించే ఈ రహదారి ప్రస్తుతం ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి వరకు 131.8 కిలోమీటర్లు ఉంటుంది. దీని కోసం రూ. 3850 కోట్లు వెచ్చించనున్నారు. ఇక జిల్లాలోని గూడెం నుంచి క్యాతనపల్లి వరకు 35 కిలోమీటర్లు రహదారి నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది. అవసరం ఉన్న ప్రాంతాల్లో బైపాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, అండర్ పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇక మంచిర్యాల వద్ద 63 నెంబర్ జాతీయ రహదారి నాగ్‌పూర్–విజయవాడ 363 జాతీయ రహదారితో అనుసంధానం కానుంది.

అభ్యంతరాల నడుమ అటకెక్కిన గ్రీన్‌ఫీల్డ్ హైవే

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి జగ్దల్‌పూర్ వరకు ఉన్న 63వ నెంబర్ జాతీయ రహదారిని గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్‌గా గుర్తించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు రహదారి నిర్మాణం చేపట్టేందుకు వీలుగా పలుమార్లు సర్వే నిర్వహించారు. పలు మార్గాల్లో రహదారి నిర్మాణంపై డీపీఆర్ రూపొందించారు. గ్రీన్ ఫీల్డ్ నిర్మాణంతో తమ విలువైన భూములు కోల్పోవాల్సి వస్తుందని భూ యజమానులు, రైతుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తడం, ఆధ్యాత్మిక ప్రదేశాలు దెబ్బతింటాయని పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. మరోవైపు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం మలుపులు తిరుగుతూ గ్రామాలు, వాగు, వంకలు తాకుతూ వెళ్లాల్సి రావడంతో నిర్మాణ వ్యయం కూడా అంచనాలకు మించినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న రహదారినే యాక్సెస్ కంట్రోల్ ప్రాజెక్టుగా విస్తరించాలని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తోంది.

## ఆశల వల.. చిక్కితే విలవిల

నిజామాబాద్ : చరవాణితో ప్రపంచ పరిజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం ఉంది. దీన్ని తెలివిగా వాడుకోవాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉండి.. వచ్చే లింక్‌లను క్లిక్ చేస్తే.. మన చరవాణులు మోసగాళ్ల అదుపులోకి వెళ్లిపోతాయి. మన విలువైన సమాచారాన్ని ఉపయోగించుకుని నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. తక్కువ డబ్బులకు పలు వస్తువులు వస్తున్నాయని, తమ ఆధార్, పాన్‌కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని, రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బులు వచ్చాయని లింక్‌లు పంపిస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ ఆశల వలలో చిక్కి అనేక మంది కష్టాలు కొని తెచ్చుకుంటున్నారు. బోథ్ మండలంలో ఇటీవల ఆధార్ అప్‌డేట్ చేయాలని బాధితుడి చరవాణికి ఓ సందేశం వచ్చింది. అది క్లిక్ చేసిన గంట తర్వాత తన బ్యాంకు ఖాతా నుంచి రూ.45 వేలు విత్‌డ్రా అయినట్లు మరో సందేశం వచ్చింది. అది చూసిన బాధితుడు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

సిరికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకులకు ఓ వాట్సప్ గ్రూపులో కిసాన్ యాప్ పేరుతో సందేశం వచ్చింది. సంబంధిత లింక్‌పై క్లిక్ చేయడంతో తమ వాట్సప్ హ్యాక్ అయింది. ఒక్కసారిగా కంగుతిన్న యువకులు అయోమయంలో పడ్డారు. తమ వాట్సప్ నుంచి హ్యాకర్లు ఇతరులకు సందేశాలు పంపించి డబ్బులు అడిగే పరిస్థితి చోటు చేసుకుంది.

ఇటీవల తక్కువ ధరకే ట్రాక్టర్ ఉందని ఫేస్‌బుక్‌లో సందేశంరాగా.. ఉట్నూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ.60 వేలు అతడు ఇచ్చిన అకౌంట్‌కు పంపారు. తిరిగి ఇంకా పంపాలని సూచించడంతో అనుమానం వచ్చి పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. దీంతో మోసానికి గురయ్యానని తెలుసుకుని లబోదిబోమన్నారు.

శ్రీ ఉట్నూరులో ఓ వ్యక్తికి సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఇటీవల హ్యాక్ అయింది. దీని నుంచి అత్యవసరంగా డబ్బులు కావాలంటూ మిత్రులకు సందేశాలు వచ్చాయి.. దీంతో పలువురు డబ్బులు పంపారు. అయినా పదే పదే సందేశాలు రావడంతో అనుమానం వచ్చి సంబంధిత వ్యక్తిని కనుక్కోగా తాను పంపలేదని సూచించారు. దీంతో వీరు పోలీస్‌స్టేషన్‌తోపాటు బ్యాంకును సంప్రదించారు.

ఇలా చేయాలిఏదైనా బ్యాంకు లేదా సంస్థ ఓటీపీలు, ఇతర వివరాలను అడిగితే వెంటనే సంబంధితశాఖను నేరుగా కలవాలి. సంబంధిత వివరాలను అడిగి తెలుసుకోవాలి. ఏదైనా పరిస్థితుల్లో మోసానికి గురైనట్లు తెలిస్తే వెంటనే 1930కి సమాచారం అందించాలి. ఎక్కువ ఆలస్యం అయితే నష్టపోయే పరిస్థితి ఉంటుంది.

వీటిని నమ్మవద్దు

బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్‌ను నమ్మవద్దు. అకౌంట్ బ్లాక్ అయింది. అప్‌డేట్ కోసం పాన్‌కార్డు నెంబరు, ఓటీపీలను అడిగితే చెప్పవద్దు

మీ కుటుంబ సభ్యులపై కేసు నమోదైంది, క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్నారంటూ నకిలీ ఎఫ్‌ఐఆర్, అరెస్టు వారెంట్ పత్రాలు పంపించి భయాందోళనకు గురి చేస్తారు. వీటితో డబ్బులను డిమాండ్ చేసే అవకాశం ఉంది.

సైబర్ మోసంలో మీరు డబ్బులు పోగొట్టుకున్నారని, వివరాలు సమర్పిస్తే డబ్బులు తిరిగి వస్తాయంటూ మోసగాళ్లు నకిలీ లింక్‌లను పంపిస్తారు. వీటిని క్లిక్ చేస్తే డబ్బులు పోయే అవకాశం ఉంది.

బ్యాంకు లోగో, ఇతర డీపీలతో బ్యాంకు పేరిట ఏపీకే ఫైల్స్‌ను వాట్సప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పంపిస్తారు. వాటిని క్లిక్ చేయడంతో మన చరవాణి నియంత్రణ మోసగాడి చేతుల్లోకి వెళ్లిపోతుంది.

వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చిత్రాలను మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసి డబ్బులు డిమాండ్ చేసే అవకాశం ఉంది. లేదంటే ఆ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంపిస్తామంటూ బెదిరింపులకు పాల్పడతారు. మహిళలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఇంటి వద్దే ఉద్యోగాలు ఇస్తామని, తక్కువ ధరకే వాహనాలు ఇస్తామంటూ మోసాలకు పాల్పడతారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఏవైనా యాప్‌ల పేరుతో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దు.

అప్రమత్తంగా ఉండాలిహసీద్ ఉల్లా, సైబర్ క్రైం డీఎస్పీచరవాణులకు వచ్చే నకిలీ వెబ్‌సైట్, నకిలీ బ్యాంకు యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. బ్యాంకుల పేరుతో, ఉద్యోగాలు, తక్కువ డబ్బులు చెల్లిస్తే ఎక్కువ వస్తాయంటూ నమ్మిస్తారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలి. లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

# తీరు మారేనా..!



జగిత్యాల : విద్యుత్తు సరఫరాలో సమస్యలుంటే ప్రతి సోమవారం ప్రజావాణి, వినియోగదారుల సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చు.. అధికారులు, సిబ్బంది లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇలా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాతోపాటు అధికారులు, సిబ్బంది పారదర్శకంగా ఉండేందుకు ఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. సంస్థలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా పనిచేస్తేనే వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందనున్నాయి.

గతంలో ఆరోపణలు..విద్యుత్తు స్తంభం, నియంత్రిక అవసరమైతే చేయి తడపందే పనులు కావనే ఆరోపణలు ఉండేవి.. కొత్త స్తంభం వేసి తీగలు బిగించాలంటే సిబ్బంది సతాయించేవారని ఫిర్యాదులు అందేవి. నియంత్రిక కాలిపోతే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. రైతులు తలా కొంత వేసుకొని ట్రాక్టర్లు సమకూర్చుకొని ఉపకేంద్రాలు, జిల్లా కేంద్రంలోని మరమ్మతు కేంద్రానికి తరలించేవారు. ఇళ్ల సమీపంలో విద్యుత్తు తీగలు వేలాడుతున్నా, కొత్త మీటరు బిగించాలన్నా ఇబ్బందులు ఎదురయ్యేవి. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి వినియోగదారుల సదస్సులు నిర్వహించినా ఫలితం లేకుండేది. విద్యుత్తు బిల్లుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినా పరిష్కారానికి నోచుకోవనే ఆరోపణలుండేవి.

ప్రస్తుతం ఇలా..!

తాజాగా విద్యుత్తు వినియోగదారులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ నూతన మార్పులకు శ్రీకారం చుడుతోంది. సిబ్బంది, అధికారులకు వినియోగదారులు లంచం ఇవ్వొద్దని, ఎవరైనా లంచం అడిగితే శాఖ అందుబాటులో ఉంచిన టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని పేర్కొంటున్నారు. గతం కంటే చాలా సౌకర్యాలు మెరుగుపర్చామని, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల కొరత లేకుండా చూస్తున్నామని అధికారులు చెబుతున్నారు. సమస్యలు ఎదురైతే సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చని, ఓ వైపు టోల్‌ఫ్రీ నంబరు, మరోవైపు ప్రజావాణి సహా ప్రతిరోజు తమ శాఖ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. వినియోగదారులతో మర్యాదగా ఉండేందుకు జేఎల్ఎం నుంచి ఏఈ వరకు రెండు నెలల కిందట శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించి సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నారు. ఉప కేంద్రాల వారీగా విద్యుత్తు సరఫరాలో లోపాలు ఉంటే నమోదు చేసుకొని సరి చేస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, నియంత్రికలను సరి చేస్తున్నారు. వర్షంలోనూ సమస్య వస్తే సరఫరాను పునరిద్ధరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం..సేవల్లో పారదర్శకంగా ఉండాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని కార్యాలయాల్లోనూ వినియోగదారులకు కనిపించేలా టోల్‌ఫ్రీ నంబరు వివరాలను బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. సిబ్బంది, అధికారులు లంచం అడితే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ పని చేస్తుంది. గంగాధర్, ట్రాన్స్‌కో ఎస్ఈ

## బడిలో స్వచ్ఛతకు 'సై'

భువనగిరి : సర్కారు బడుల్లో స్కావెంజర్ల నియామకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన జీవో నెంబర్ 21 అన్ని పాఠశాలలకు చేరింది. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా ఈ నిధులను అందజేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి కూడా ఉపశమనం కలగనుంది.

నేరుగా అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాల్లోకి..

నిధులు నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమ



కానున్నాయి. మూడు నెలలకు సంబంధించిన నిధులను ముందే సంబంధిత ఖాతాలలో జమ చేయాలని నిర్ణయించారు. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్టు నుంచి ఈ నిధులను అందజేయాలని నిర్ణయించినట్లు జీవోలో విద్యాశాఖ పేర్కొంది. స్కావెంజర్ నిత్యం పాఠశాల, పరిసరాలను శుభ్రపరచడం, మూత్రశాలలు, మరుగుదొడ్లను కడగడంతో పాటు మొక్కలకు నీళ్లు పెట్టడం తదితర పనుల్ని నిర్వహించాల్సి ఉంటుంది. తొలగనున్న ఇబ్బందులు.. ప్రభుత్వ నిర్ణయంతో పారిశుద్ధ్య పరంగా ఎదురవుతున్న ఇబ్బందులు పాఠశాలలకు తప్పనున్నాయి. ఈ చర్యతో పంచాయతీ సిబ్బందికి పనిభారం తగ్గనుంది. పారిశుద్ధ్య పనులు నిర్వహించే వారికి ప్రతి నెలా రూ.3 వేలకు తగ్గకుండా ఇవ్వాలని నిర్ణయించడంతో పారిశుద్ధ్య పనులకు కూలీలు పోటీ పడే అవకాశం లేకపోలేదని పలువురు భావిస్తున్నారు.

## ఆలోచన గానుగ తిప్పింది..!

నల్గొండ : నిత్యావసర వస్తువుల్లో రోజు రోజుకు కల్తీ పెరిగిపోతోంది. వంటకాల్లో కీలకమైన నూనెలో ఇది ఎక్కువగా జరుగుతోంది. కల్తీ నూనె వినియోగించిన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. ఈ తరుణంలో ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా నల్గొండ మండలం రాములబండ గ్రామానికి చెందిన యువ రైతు దంపతులు బొబ్బిలి జనార్దన్‌రెడ్డి, జ్యోతి స్వచ్ఛమైన నూనె తయారు చేసి అందిస్తున్నారు. ఎద్దులతో నడిచే కట్టె గానుగతో సహజసిద్ధమైన నూనెలను వినియోగదారుల ముందే తయారు చేసి అక్కడే ప్రజలకు అమ్మకాలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా డబ్బాలల్లో ప్యాకింగ్ చేస్తూ ఇతర ప్రాంతాలకు సైతం ఆర్డర్లపై సరఫరా చేస్తున్నారు. పలువురుకి ఉపాధి రైతు జనార్దన్‌రెడ్డి తొలుత ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లి పదేళ్లకు పైగా హౌజ్ వైరింగ్, లైటింగ్, డెకరేషన్



వంటి పనులు చేసేవారు. 2019లో విజృంభించిన కరోనాతో ఆయన తన స్వగ్రామానికి చేరారు. తనకు ఉన్న సాగుభూమిలో వ్యవసాయంతోపాటు కల్తీలేని సహజసిద్ధమైన వంట నూనె తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి గానుగలు రెండు తయారు చేయించి కల్తీలేని పల్లీ, కొబ్బరి, నువ్వులు, కుసుమ, ఆవాలుతో నిత్యం వందల లీటర్ల నూనె తయారు చేసి ఉత్పత్తి ప్రారంభించారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో యూనిట్ ఉండటంతో గానుగ నూనెకు ఆదరణ పెరిగింది. దీంతో తను ఆర్థికంగా రాణించడంతో పాటు నలుగురు గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించి యువతకు ఆదర్శంగా నిలిచారు.

## దేవాదాయ శాఖలో.. ధర్మకర్తల సందడి

భద్రాచలం : దేవాదాయ శాఖలో ధర్మకర్తల మండళ్ల ఎంపికకు రంగం సిద్ధమైంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 23 ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను నియమించాలని ఆశాఖ నిర్ణయించింది. ఈమేరకు దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి ఈనెల 3న ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రతులను ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 6 సి, 6 బి కేటగిరీల కోవెళ్లలో ఈ తరహా సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో శ్రమించినందున తమ సేవలను గుర్తించి గౌరవ హోదా కల్పించాలని కొందరు నాయకులు మంతనాలు సాగిస్తున్నారు.

ఆశావహుల్లో సంతోషం..



భద్రాచలంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం, శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం, దుమ్ముగూడెం మండలంలోని శ్రీఆత్మారామ చంద్రస్వామి ఆలయాలకు ధర్మకర్తలు లేరు. ఈ ఏడాది జూన్‌లో పదవీకాలం పూర్తి కావడంతో పాత కమిటీలు రద్దయ్యాయి. కొత్త నోటిఫికేషన్.. ఆశావహులకు సంతోషాన్ని కలిగిస్తోంది. అన్నపురెడ్డిపల్లి మండలంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం, కొత్తగూడెంలోని పాండురంగ భజన మందిరం, ఖమ్మంలోని మైసమ్మ ఆలయం వంటి చోట్ల పాలక మండళ్లను నియమించేందుకు కసరత్తు మొదలైంది. ఐదు నుంచి ఏడుగురు వరకు కమిటీలో ఉండొచ్చు. ఇందులో మహిళ, ఎస్టీలకు ప్రాధాన్యం ఉంటుంది. నోటిఫికేషన్ వచ్చిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దేవాదాయ శాఖకు అన్ని అర్హత పత్రాలతో ఫొటోను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి. ఇందులో పోలీసు కేసులు లేవనే నిర్ధారణ పత్రం తప్పనిసరి. శాఖాపరమైన విచారణ పూర్తయ్యాక వీటిని భర్తీ చేసే వీలుంది. అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ప్రభుత్వం పారదర్శకంగా నియమిస్తుందని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ఈఓ సుదర్శన్ తెలిపారు.

## బిల్లుల చెల్లింపుల్లో గందరగోళం



భగత్‌నగర్: గత జులై నుంచి విద్యుత్తు బిల్లులను యూపీఐ మాధ్యమాలైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల నుంచి చెల్లించడాన్ని నిలిపివేస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో.. సంస్థకు ఆన్‌లైన్ చెల్లింపులు తగ్గిపోయాయి. గతంతో పోలిస్తే 40 వేల విద్యుత్తు సర్వీసుల వారు ఆఫ్‌లైన్‌లో చెల్లించారు. దీంతో సంస్థ ఉద్యోగులపై పనిభారం పెరిగింది. వినియోగదారుడు చెల్లించేందుకు విద్యుత్తు బిల్లుల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

సంస్థపై అదనపు భారం..ఇప్పటివరకు వివిధ రకాల యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులతో ఉద్యోగులకు పనిభారం తగ్గడంతోపాటు సంస్థకు ఆర్థిక భారమూ తగ్గింది. జిల్లాలో ఆన్‌లైన్ చెల్లింపులూ 63 శాతం పెరిగాయి. అయితే విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రంలో చెల్లిస్తే వినియోగదారుడికి రశీదు ఇవ్వాలి. దానికోసం ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి.. అందులో ఒప్పంద పొరుగుసేవల కార్మికులను నియమించింది. ఇందులో వినియోగదారుడి ఒక్కో చెల్లింపునకు.. పొరుగుసేవల కార్మికునికి నగరంలో రూ.2.49 పైసలు, గ్రామాల్లో రూ.2.73 పైసలు చెల్లిస్తున్నారు.

జూన్‌లో 1,37,179 సర్వీసులు యూపీఐ మాధ్యమాల్లో చెల్లించాయి. గత నెలలో యూపీఐ మాధ్యమాల్లో చెల్లింపులను నిషేధించి.. విద్యుత్తు సంస్థ నిర్దేశించిన యాప్, బిల్ డెస్క్‌లో చెల్లించాలనడంతో.. 57,907 సర్వీసుల వారు విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలను ఆశ్రయించారు. విద్యుత్తు సంస్థకు రూ.1,44,188 అదనపు ఆర్థిక భారం పడింది. ఇదే సమయంలో రశీదు కోసం ఇచ్చే పేపర్‌తోపాటు బిల్లింగ్ యంత్రం కార్మికులకు అందుబాటులో పెట్టాల్సి ఉంటుంది. ఇది సంస్థకు మరో భారం. విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాల్లో చెల్లించిన వినియోగదారుల వివరాలను సంస్థ లెడ్జర్‌లో నమోదు చేయాలి. ఇలా వెయ్యి సర్వీసులు నమోదు చేయడానికి ఒకరోజు పడుతుంది. ఈ ఇబ్బందులను అధిగమించినా.. బిల్లు నమోదు సమయంలో మానవ తప్పిదాలు దొర్లే అవకాశం ఉంటోంది. ఇది వినియోగదారునికి శాపంగా మారుతుంది.

సులువుగా.. రుసుము లేకుండా

విద్యుత్తు సంస్థ అందుబాటులో ఉంచిన %www.tgnpdcl.in% వెబ్‌సైట్‌లో లేదా %TGNPDCL% యాప్‌లో, ఎన్‌పీడీసీఎల్ బిల్ డెస్క్‌లో బిల్లులు చెల్లించేందుకు సంస్థ అవకాశం కల్పించింది. అయితే ఈ అవకాశాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేయాలి. ఈ యాప్‌లో ప్రవేశించాక.. గూగుల్ పే లాంటి యూపీఐ ప్రొవైడర్లను వాడే అవకాశమూ ఉంది. ఇటీవల ఓ వినియోగదారుడు తనకు వచ్చిన విద్యుత్తు బిల్లు రూ.3933ను సంస్థ నిర్దేశించిన మాధ్యమాల్లో ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ప్రయత్నించగా.. కన్వీనియన్స్ రుసుము రూ.35.39, జీఎస్టీ రూ.6.37 చూపించడంతో ఈ విషయాన్ని సీనియర్ అకౌంట్స్ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. క్రెడిట్ కార్డులు ఉపయోగించినప్పుడు ఇలా జరిగి ఉంటుందని, యూపీఐ ఐడీని వినియోగిస్తే ఎలాంటి అదనపు రుసుములు చెల్లించాల్సి ఉండదని స్పష్టం చేశారు.

## వినియోగదారుల కమిషన్లు పెంచితేనే సత్వర న్యాయం



హైదరాబాద్: కేసుల పరిష్కారంలో వేగం పెంచేలా రంగారెడ్డి జిల్లాలో మూడు వినియోగదారుల కమిషన్లు, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లో ఒక్కో కమిషన్ ఏర్పాటు చేయాలంటూ ఆయా జిల్లా వాసుల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో మూడు కమిషన్లు ఉన్నా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కలిపి ఒకే కమిషన్ ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 90 రోజుల్లో పరిష్కారమవ్వాల్సిన కేసుల్లో జాప్యం పెరుగుతోందని, అదనపు బెంచీలు ఏర్పాటు చేస్తే సత్వర పరిష్కారం సాధ్యమంటూ అభ్యర్థనలు పంపుతున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల సంఘం తరపున ప్రభుత్వానికి లేఖలు పంపారు.

వ్యయ ప్రయాసలతో... రాష్ట్రంలో ఉమ్మడి పది జిల్లాలకు సంబంధించి మొత్తం 12 జిల్లా వినియోగదారుల కమిషన్లు కొనసాగుతున్నాయి. పాత పది జిల్లాల్లో ఒకటి చొప్పున, హైదరాబాద్ జిల్లా జనసాంద్రత దృష్ట్యా హైదరాబాద్ 1, 2, 3 జిల్లా వినియోగదారుల కమిషన్లు కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా భౌగోళిక విస్తీర్ణం పెరగడం, అభివృద్ధి చెందడంతో వినియోగదారుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో వినియోగదారుల కమిషన్ కొనసాగుతూ అత్యధిక కేసులు పరిష్కరిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతినెలా 90కి పైగా కేసులు నమోదవుతుండగా 50కి పైగా కేసులు పరిష్కారమవుతున్నాయి. ప్రధానంగా రియల్ ఎస్టేట్ మోసాలు అధికంగా జరుగుతున్న మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు జిల్లా కమిషన్లు ఏర్పాటు చేస్తే రెండు జిల్లాల వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుందని విన్నవిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కమిషన్‌లో కేసు వేసి విచారణకు రావడానికి వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి వాసులు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎల్బీనగర్‌లోని కమిషన్‌తో పాటు శంషాబాద్, చేవెళ్ల, కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు ఆయా ప్రాంతాల్లో అదనపు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## సీతారామ.. కరుణ చూపుమా..!

కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. తొలుత గోదావరి నీటిని పాలేరు జలాశయంలోకి మళ్లించేందుకు ప్రణాళికలు రూపొందించి కాల్వ పనులు ప్రారంభించారు. జూలూరుపాడు సమీపంలో టన్నెల్ నిర్మాణానికి అటవీ అనుమతులు రాకపోవటంతో పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్(ఏన్కూర్) అనుసంధాన కాల్వ ద్వారా గోదావరి నీటిని ఖమ్మం జిల్లాలోని సాగర్ ఎడమ కాల్వలోకి మళ్లించాలని నిర్ణయించింది. రూ.96 కోట్లతో 8.6కి.మీ పొడవైన కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించింది. పనులు పూర్తవటంతో గోదావరి జలాలను తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో 'సీతారామ' ద్వారా భద్రాద్రి జిల్లాకు నీరందించే విషయం చర్చనీయాంశమవుతోంది.

రూ.3,200 కోట్ల అంచనాలతో..

'సీతారామ' తొలిదశలో కీలకంగా ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కు ప్రాధాన్యమిచ్చేలా రూ.3,200కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గోదావరి జలాలను ఆరు దశల్లో ఎత్తిపోసి ఇల్లెందు నియోజకవర్గంలో 65,483 ఎకరాలకు సాగునీరందించాలనుకున్నారు. మొదట జూలూరుపాడు కెనాల్ ద్వారా సింగరేణి మండలం లలితాపురం చెరువులోకి నీటిని మళ్లించాలని నిర్ణయించారు.



ఇక్కడి నుంచి 216 అడుగుల ఎత్తులోని రోళ్లపాడు రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయాలనుకున్నారు. ఆతర్వాత గ్రావిటీ కాల్వల ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సాగునీరందించాలని యోచించారు. రోళ్లపాడులో నిర్మించిన లిఫ్ట్ ద్వారా ఇల్లెందు మండలం రొంపేడు దగ్గర నీటిని ఎత్తిపోయాలనుకున్నారు. ఇక్కడి నుంచి బయ్యారం చెరువులోకి నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. గత ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టకపోవటం, తర్వాతరాష్ట్రంలో అధికార మార్పిడి జరగటంతో ఈప్రతిపాదన మరుగునపడింది.

పాత ప్రణాళికను పక్కనబెట్టి.

సీతారామ ప్రాజెక్టుకు అప్పటి సీఎం కేసీఆర్.. టేకులపల్లి మండలం రోళ్లపాడులో 2016 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లు తదితర కారణాలతో ప్రాజెక్టు ప్రణాళిక, డిజైన్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లోని అనేక ప్రాంతాలకు నీరందకుండా పోయింది. అప్పటి ఎమ్మెల్యేల విన్నపం మేరకు పాత ప్రణాళికను పక్కనపెట్టి కొత్త డీపీఆర్‌ను అధికారులు సిద్ధం చేశారు. జూలూరుపాడు కాల్వ నుంచి ఎత్తిపోతల ద్వారా ఇల్లెందు నియోజకవర్గంలోని ఎల్‌టీ బయ్యారం చెరువులోకి నీళ్లొచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

సీఎం పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 15న వైరాలో ప్రారంభించనున్నారు. తలాపున ప్రవహించే గోదావరి జలాలను భద్రాద్రి జిల్లా పంటపొలాలకూ అందించాలనే అంశం తెరపైకి వచ్చింది. గతంలో రూపొందించిన ప్రణాళికను అమలుచేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై బహిరంగ సభలో సీఎం ప్రకటన చేస్తారని ఎదురుచూస్తున్నారు.

## ఆదర్శ 'ఒర'బడి..!

పాల్వంచ : గతేడాది తాగునీరు, మరగుదొడ్లు, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడ్డాం. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమే 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' పథకంలో భాగంగా రూ.4.65 లక్షలతో మా పాఠశాలలో తాగునీటి సదుపాయం కల్పించారు. చిన్నపాటి మరమ్మతులు చేశారు. మరగుదొడ్లను ఆధునికీకరించారు. విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. మధ్యాహ్న భోజన సమయానికి చక్కగా చేతులు శుభ్రం చేసుకుంటున్నాం.

పల్లవి, నాలుగో తరగతి, అబ్బుగూడెం ప్రాథమిక పాఠశాల, అన్నపురెడ్డిపల్లి మండలం

పనుల్లో పురోగతి

సర్కారు బడులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. కార్పొరేట్ బడులకు దీటుగా మార్చాలనే ఉద్దేశంతో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు 2024 మే



మాసంలో శ్రీకారం చుట్టింది. పర్యవేక్షణ బాధ్యతలను సంబంధిత జిల్లా కలెక్టర్‌కు అప్పగించటంతో పనుల్లో పురోగతి కనిపిస్తోంది. స్వల్ప వ్యవధిలో తక్కువ ఖర్చుతో పనులు పూర్తయ్యేలా రూపొందించిన కార్యాచరణ సత్ఫలితాలనిస్తోంది.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తొలి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ప్రధానంగా తాగునీరు, విద్యుత్తు సదుపాయం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర మరమ్మతులకు ప్రాధాన్యమిస్తున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ల ఆదేశాల మేరకు అన్ని రకాల వసతులు సమకూరుతున్నాయి. పనులు చేసిన వారికి వెంటవెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం.

వెంకటేశ్వరాచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం


మిగతాచోట్ల రంగులు, బెంచీలు తదితరాలు సమకుర్చాల్సి ఉంది. ఎంబీ రికార్డు అయిన వెంటనే బిల్లులను 'అమ్మ ఆదర్శ కమిటీ' ఖాతాలో సర్కారు జమచేస్తోంది.

# హద్దులు గీద్దాం.. ఆక్రమిస్తే వేటేద్దాం

హైదరాబాద్: రాజధాని నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు కొత్త పంథా అనుసరిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి వాటి సరిహద్దులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి చెరువు విస్తీర్ణం, ఫుల్‌ట్యాంక్ లెవల్, బఫర్‌జోన్‌ల పరిధులను డిజిటల్ యంత్రాలతో సర్వే చేసి ఆయా మ్యాపులను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో పెడుతున్నారు. ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే డిజిటల్ సాక్ష్యాల ఆధారంగా వారిపై కేసులు నమోదు చేయించడంతో పాటు క్రిమినల్ చర్యలు చేపట్టనున్నారు.

బోర్డులు పెట్టి.. స్వయంగా వెళ్లి..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రతి చెరువు వద్దకు అధికారులు వెళ్లి స్వయంగా అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. తటాకాల వివరాలు సేకరించి ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్లను సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. తొలుత ప్రాథమిక నివేదికను సిద్ధం చేసి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. రెండోసారి అక్కడికి వెళ్లి ఆక్రమణలున్నాయా? లేదా? అన్న అంశాలను పరిశీలించి తుది సర్వే పూర్తిచేస్తున్నారు. ఈ సర్వే వివరాలతో కూడిన చెరువుల వివరాలను హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో నవీకరించారు. ఇప్పటివరకూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 85శాతం చెరువుల విస్తీర్ణాన్ని ప్రాథమిక సర్వే ద్వారా



గుర్తించారు. రెండో విడతలో తుది సర్వే నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఆక్రమణలకు చెక్ పెట్టేలా.. బృందాలు

చెరువులను చెరబట్టే అక్రమార్కుల ఆటకట్టించేందుకు ప్రత్యేక బృందాలను రెవెన్యూ అధికారులు నియమించారు. ఈ బృందాల్లో తాజాగా హైడ్రా నుంచి ఒకరిద్దనియమించనున్నారు. ఈ సభ్యులు రియల్ వెంచర్లకు సమీపంలోని చెరువులపై దృష్టి పెట్టి రెండు, మూడు రోజులకోమారు వెళ్లి పరిశీలించనున్నారు. ప్రాధాన్య ప్రాంతాల్లోని చెరువుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వెబ్‌సైట్‌లో ప్రతి చెరువు పరివాహక ప్రాంతాన్ని జియోట్యాగింగ్ చేయనున్నారు. తద్వారా ఆక్రమణలు అధికారులకు తెలిసిపోతుంది.

మొత్తం చెరువులు 1075
సర్వే కోసం గుర్తించినవి 945
ప్రాథమిక సర్వే పూర్తయినవి 775
తుది సర్వే పూర్తయినవి 79

# నియంత్రికలపై పిడుగుపాటు

భానుపురి : ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్తు శాఖకు నష్టం వాటిల్లింది. పిడుగుపాటు కారణంగా జిల్లాలోని విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి జూన్, జులై నెలలో 1316 నియంత్రికలు దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో కొద్దిపాటి మెరుపులు, పిడుగులకే అవి కాలిపోతున్నాయి. వాటి స్థానంలో మరమ్మతు చేసిన నియంత్రికలు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా మరమ్మతుల కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన నియంత్రికలను సిబ్బంది ఎప్పటికప్పుడు బాగు చేసి తిరిగి అందజేస్తున్నారు. ఆలస్యమైతే వాటి బదులు కొత్తవాటిని ఇస్తున్నారు.

రూ. లక్షల్లో నష్టం సూర్యాపేట జిల్లా విద్యుత్తు సర్కిల్ కార్యాలయం పరిధిలో సూర్యాపేట, హుజూర్‌నగర్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1,49,961 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉండగా, సూర్యాపేట డివిజన్ పరిధిలో 66,808, హుజూర్‌నగర్ పరిధిలో 82,883 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో మొత్తం త్రీఫేజ్, సింగిల్‌ఫేజ్ నియంత్రికలు కలుపుకొని 45,148 ఉన్నాయి. వీటిలో జున్, జులై నెలలో ఉరుములు, మెరుపులకు 1316 నియంత్రికలు కాలిపోయాయి. దీంతో విద్యుత్తు శాఖకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. కరెంటు సరఫరాలో అంతరాయం తలెత్తకుండా అధికారులు జిల్లా కేంద్రంలో నియంత్రికలను అందుబాటులో ఉంచారు. కొత్తవాటితో పాటు మరమ్మతు చేసిన వాటిని ఎప్పటికప్పుడు బిగిస్తున్నారు.

సరఫరాలో అంతరాయం కలగకుండా.. – శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేటజిల్లాలో ఉరుములు, మెరుపుల కారణంగా విద్యుత్తు నియంత్రికలు కాలిపోతున్నాయి. ఈ కారణంగా కరెంటు సరఫరాలో అంతరాయం తలెత్తకుండా వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నాం. వర్షాకాలంలో నియంత్రికలు దెబ్బతినే అవకాశం ఉండటంతో ముందుగానే కొత్తవాటిని అందుబాటులో ఉంచాం. రైతులకు కరెంటు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# మసక..మసక చీకటిలో నకిలీ నోట్ల చెలామణి

హైదరాబాద్: స్థానికంగా ఉండే కుర్రాడే.. రోజుకో దుకాణానికి వెళ్లి రూ.500 నోటిచ్చి వస్తువులు కొంటుండేవాడు. ఒక వ్యాపారికి అనుమానం వచ్చి ఆరా తీస్తే అవన్నీ నకిలీ నోట్లుగా తేలింది. అప్పటికే ఆ యువకుడు రెండు నెలలుగా రూ.10వేలకు పైగా నోట్లు మార్చినట్టు గుర్తించారు. నగరంలోని కాలనీలు.. బస్తీల్లో చిల్లర దుకాణాలు... తోపుడుబండ్లు.. చిరువ్యాపారులు లక్ష్యంగా పెద్దఎత్తున నకిలీనోట్ల మార్పిడి జరుగుతోందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. తాజాగా పలు ప్రాంతాల్లో రూ.500 నకిలీ నోట్లు చెలామణీ చేస్తున్నట్టు ఠాణాలకు ఫిర్యాదులుఅందుతున్నాయి.

ఐదువేలిస్తే.. రూ.10వేలు : దిల్లీ, మహారాష్ట్రకు చెందిన ముఠాలు నకిలీనోట్లను ముద్రిస్తున్నాయి. నగరంలో దళారులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. విద్యార్థులు, నిరుద్యోగులు, పాతనేరస్థులను ఏజెంట్లుగా మలచుకుంటున్నాయి. ఈ ఏడాది నగరంలోని ప్రముఖ బ్యాంకుకు వచ్చిన నోట్లకట్టల్లో రూ.60వేల నకిలీ నోట్లు ఉన్నట్టు గుర్తించారు. ఇవన్నీ జూబ్లీహిల్స్‌కు చెందిన చిరువ్యాపారి జమచేసినట్టు తేలింది. వీటినెలా మార్చుతారంటే..: ఎక్కువగా తోపుడుబండ్లు, కూరగాయల మార్కెట్లు, పచారీ వస్తువులు, తినుబండారాలు విక్రయించే దుకాణాలు ఎంపిక చేసుకుంటారు. వయోధికులు, మహిళలున్న దుకాణాల్లోకి రాత్రి సమయాల్లో మాత్రమే వెళతారు. రూ.100–150 విలువైన వస్తువులు కొనుగోలు చేసి రూ.500 నకిలో నోటు చేతికిస్తారు. మిగిలిన చిల్లర తీసుకొని వెళ్తారు.

# నిధుల మంజూరుకు ఏడాది... పనుల పూర్తికి ఎన్నాళ్లో?



కోనరావుపేట: మండలంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా అధునాతన వసతులతో పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించాలని భావించారు. ఇందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయినా అధికారుల అలసత్వం వల్ల పనులు పూర్తికాని పరిస్థితి ఏర్పడింది.

కోనరావుపేట మండల కేంద్రంలో మోడల్ పంచాయతీ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం ఏడాది క్రితం ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసింది. గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి పనులు చేపట్టారు. నిధులు చాలకపోవడంతో స్లాబ్ వరకు నిర్మించి మధ్యలో వదిలేశారు. గుత్తేదారుకు ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో బిల్లుల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు నిధులు చాలకపోవడంతో అప్పటి మంత్రి కేటీఆర్ అదనంగా జిల్లా భూగర్భ జల వనరుల నిధులు (డీఎంఎఫ్‌టీ) రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నేటికీ టెండరు ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు సాగడం లేదు. ఇతర గ్రామాలకు ఆదర్శంగా అధునాతన భవనం నిర్మించాలని భావించినా నిర్మాణం మధ్యలో ఆగిపోవడంతో లక్ష్యం నెరవేరలేదు. మరోవైపు శిథిలావస్థలోని భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. చిన్నపాటి వర్షానికి భవనం గోడలు, స్లాబ్ పగుళ్ల బారి గదుల్లో నీరు చేరి చిత్తడిగా మారుతోంది. కార్యాలయంలోని సామగ్రి, రికార్డులకు భద్రత కరవైంది. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుబయట చెట్టు కింద కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సభలు, ఇతర సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి టెండరు ప్రక్రియ పూర్తి చేసి త్వరగా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విప్ చొరవ చూపాలి

గతంలోనే డీఎంఎఫ్‌టీ, ఉపాధి హామీ నిధులతో కలిపి నిర్మాణం చేపట్టాలని అధికారులకు విన్నవించినా నిబంధనల మేరకు సాధ్యపడలేదు. గ్రామానికి చెందిన గుత్తేదారు రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో పనులు చేశారు. గుత్తేదారుకు ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో అవస్థలు పడుతున్నాడు. డీఎంఎఫ్‌టీ నిధులు మరో రూ.50 లక్షలు మంజూరు కావడంతో ఆన్‌లైన్‌లో టెండర్ ఖరారు కావాల్సి ఉంది. ఆరు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. శిథిల భవనంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపి టెండర్ ఖరారు త్వరగా పూర్తి చేసేలా చూడాలి.

పోకల రేఖ, మాజీ సర్పంచి, కోనరావుపేట

ఎన్నికల కోడ్‌తో జాప్యం

ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి హామీ నిధులు పూర్తయ్యాకే డీఎంఎఫ్‌టీ నిధులతో పనులు చేయాల్సి ఉంది. నిధులు మంజూరై ఏడాది కావస్తున్న మాట వాస్తవమే. రెండు పర్యాయాలు శాసనసభ, పార్లమెంటు ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో జాప్యం జరిగింది. ఇటీవల ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలయ్యాయి. గుత్తేదారు ఖరారు ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

అంజయ్య, పీఆర్ ఏఈ, కోనరావుపేట

# 'స్మార్ట్'గా దోచేస్తున్నారు



మేడిపల్లి : స్మార్ట్ ఫోన్ ఉంది కదా అని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్, సందేశాలకు స్పందిస్తే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. అధిక డబ్బులు ఆశచూపి నేరగాళ్లు అమాయకులను వలలో వేస్తున్నారు. సైబర్ మోసాల బారిన పడుతున్న వారిలో అధికంగా విద్యావంతులే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల సైబర్ ఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పెరిగిపోయాయి. అప్రమత్తంగా ఉంటేనే మోసాల నుంచి గట్టెక్కవచ్చని పోలీసులు చెబుతున్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఓ హోల్‌సేల్ చికెన్ వ్యాపారికి మోసగాళ్లు వాట్సప్‌లో లింక్ పంపారు. సదరు వ్యాపారి ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే రూ.9.60 లక్షలు ఖాతా నుంచి మాయమయ్యాయి.

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి వాట్సప్‌లో వచ్చిన లింక్ బ్యాంక్ నుంచి వచ్చిందే అని భావించి ఏటీఎం వివరాలు పంపాడు. రూ.40 వేలు అకౌంట్ నుంచి బదిలీ అయ్యాయి.

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల దుంపేటకు చెందిన ఓ వ్యక్తికి ఆధార్ అప్‌డేట్ అంటూ లింక్ రాగా ఓపెన్ చేశాడు. 3 రోజుల్లో అతని ఖాతా నుంచి నిందితులు రూ.1.13 లక్షలు మాయం చేశారు.

ఈ ఏడాది మే నెలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ మహిళ ఎస్పీని కలసి తన కుమారుడిని కంబోడియాలో చిత్రహింసలు పెడుతున్నారని ఫిర్యాదు చేసింది. ఎస్పీ అఖిల్ మహాజన్ కంబోడియా ఎంబసీ అధికారులతో మాట్లాడి సైబర్ నేరస్థుల చెర నుంచి బాధితుడిని విడిపించారు. స్థానికంగా సైబర్ మోసాలకు పాల్పడటం ఒక ఎత్తయితే ఉద్యోగార్థులను కంబోడియాకు రప్పించి ఆన్‌లైన్ మోసాలు చేయిస్తున్నారు. అమాయకులను వలలో వేసేందుకు చైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని ఏజెంట్లకు రూ.10 వేల చొప్పున ఇస్తున్నారు. కమీషన్ల ఆశతో ఏజెంట్లు పలువురిని కంబోడియాకు పంపుతుండగా అక్కడి నేరగాళ్లు కాల్‌సెంటర్లలో పలువురిని నియమించుకొని సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తున్నారు. ఇలా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన యువకుడిని కంబోడియాకు పంపిన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలానికి చెందిన ఓ నిందితుడు సహా మహారాష్ట్రలోని పుణె, బిహార్‌కు చెందిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రామగుండం, మంచిర్యాల కోల్‌బెల్ట్ ప్రాంతంలో రూ.10 వేలు పెట్టుబడిగా పెడితే ప్రతిరోజు రూ.500 చొప్పున వస్తాయని కొందరు నమ్మబలికారు. రూ.10 కోట్ల మేర అమాయకుల నుంచి వసూలు చేసి తీరా యాప్‌ను మూసేయడంతో బాధితులంతా లబోదిబోమన్నారు. చైన్ మార్కెటింగ్ పేరిట ఇలాంటి మోసాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కువే జరుగుతున్నాయి.

స్టాక్ మార్కెట్‌లో తాము అధిక లాభాలు ఆర్జించిపెడతామని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన చూసిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఓ వైద్యుడు రూ.74.38 లక్షలు మోసపోయి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్రమత్తతే ప్రధానం

పార్ట్‌టైం ఉద్యోగాలు, వర్క్ ఫ్రం హోం, కొరియర్ల పేరిట గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు.

బ్యాంక్ ఖాతాలకు ఫోన్ నంబరు, ఆధార్ నంబరు లింక్ చేయాలంటూ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. బ్యాంక్‌కు వెళ్లి నిర్ధరించుకోవాలి గానీ ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోవద్దు.

వాట్సప్‌లో పంపిన క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసి వివరాలు పంపాలంటూ పలువురికి మెసేజ్‌లు వస్తున్నాయి. ఇవి కూడా సైబర్ నేరగాళ్లే పంపుతున్నారని గుర్తుంచుకోవాలి.

మీరు లాటరీలో డబ్బులు గెలిచారంటూ సందేశం పంపుతుంటారు. వాటిని నమ్మొద్దు.

డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలను తెలుసుకుని మోసాలకు పాల్పడిన సందర్భాల్లో ముందుగా ఆయా కార్డులను బ్లాక్ చేసి సంబంధిత బ్యాంక్‌కు సమాచారం ఇవ్వాలి.

ఎవరైనా ఆన్‌లైన్ మోసాల బారిన పడినప్పుడు 1930 నంబరుకు, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ %cybercrime.gov.in% వెబ్‌సైట్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చు.

సత్వర ఫిర్యాదుతో న్యాయం

సైబర్ మోసాల బారిన పడి విద్యావంతులు కూడా నష్టపోతున్నారు. ట్రేడింగ్, బ్యాంక్ ఖాతాలకు లింక్ తదితరాల పేరిట ప్రమాదకరమైన మెసేజ్‌లు పంపుతూ ఖాతాల్లోంచి నగదు దోచేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం ఎంత ముఖ్యమో ఏదైనా మోసం బారిన పడినప్పుడు 1930 నంబరుకు ఫోన్ చేసి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, మాట్రీమోనీ, బ్యాంక్‌ల పేరిట వచ్చే సందేశాలకు స్పందించవద్దు.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

# హెచ్‌ఎండీఏలో కొత్త జోన్లు.. ఉత్తర్వులు జారీ


హైదరాబాద్: ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ)లో జోన్లు పెరిగాయి. ఎప్పటి నుంచే ప్రతిపాదనల దశలో ఉన్న జోన్ల పెంపు ఎట్టకేలకు మొదలయ్యింది. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లను ఆరు జోన్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్లను యథాతథంగా ఉంచి..మేడ్చల్, శంకర్‌పల్లిలను రెండేసి జోన్లుగా విభజించారు. హెచ్‌ఎండీఏ ప్రాంతం 7200 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. త్వరలో ఆర్ఆర్ఆర్ మొత్తం హెచ్‌ఎండీఏ పరిధిలోకి తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లలో పరిధి ఎక్కువగా ఉండటంతో సేవల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం చోటుచేసుకుంటోంది. జోన్లను విభజించడం తోపాటు అదనపు సిబ్బంది నియామకానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్లానింగ్ విభాగం ప్రక్షాళన... ప్రణాళిక విభాగంలో ఏళ్ల తరబడి ఒకేచోట ఉన్న అధికారులను బదిలీ చేస్తూ హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నాలుగేళ్లు అంతకుమించి ఒకేచోట ఉన్న వారిని బదిలీ చేశారు. ఇప్పటికే డిప్యుటేషన్‌పైన హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో విధుల నిర్వహిస్తున్న డైరెక్టర్, పీవోలకు స్థాన చలనం కల్పించారు. కొత్తగా ఏర్పాటైన మేడ్చల్ జోన్–1 ప్లానింగ్ అధికారిగా గోపిక రమ్య, మేడ్చల్–2 ప్లానింగ్ అధికారిగా కె.శాలినికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు మేడ్చల్ చీఫ్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన యశ్వంత్‌రావు ఘట్‌కేసర్ జోన్‌కు బదిలీ అయ్యారు. శంకర్‌పల్లి జోన్ పీవో యాదగిరిరావును మాస్టర్‌ప్లాన్ యూనిట్‌కు బదిలీ చేశారు. కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి జోన్–1కు చీఫ్ ప్లానింగ్ అధికారిగా బి.ప్రసాద్‌రావు, శంకర్‌పల్లి–2కు సీపీవో మల్లికార్జునరావును నియమించారు.

# దండుమల్కాపురంలో రెండు టెర్మినళ్లు..!

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో రెండు టెర్మినళ్లు ఏర్పాటు అవుతున్నాయి. సర్వే నంబరు 120లో 83 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,800 కోట్లతో నిర్మించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) టెర్మినల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో ఈ టెర్మినల్‌ను ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఏడాది క్రితం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) టెర్మినల్ నిర్మాణానికి కూడా దండుమల్కాపురం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక పార్కు(ఎంఎస్ఎంఈ) పక్కనే సర్వే నంబరు 617లో 75 ఎకరాల స్థలాన్ని టీఎస్ఐఐసీ కేటాయించింది. సుమారు రూ.1500 కోట్ల వ్యయంతో బీపీసీఎల్ టెర్మినల్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుతం బీపీసీఎల్ టెర్మినల్‌కు సంబంధించి పైపులైన్ల నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నాయి. భూమికి 1.5 మీటర్ల లోతులో పైపులను వేస్తున్నారు. వ్యవసాయ భూముల నుంచి వేస్తే రైతులకు, రహదారుల వెంట అయితే ప్రభుత్వ సంస్థలకు పరిహారం చెల్లిస్తున్నారు.

పైపులైన్ల ద్వారా ఇంధనం సరఫరా..



ఈ టెర్మినళ్లలో పెట్రోలియం, డీజిల్, కిరోసిన్, ఎవియేషన్ టర్బన్ ఫ్యూయల్(ఏటీఎఫ్)ను విడుతల వారీగా పైపుల ద్వారా సరఫరా చేసి నిల్వ చేస్తారు. ఏటీఎఫ్‌ను విమానాలకు ఇంధనంగా వాడుతారు. ఐవోసీఎల్ టెర్మినల్‌కు.. పారాదీప్(ఒడిశా) నుంచి దండుమల్కాపురం వరకు 1212 కిలో మీటర్లు మేర పైపులైన్లను వేశారు. ఐవోసీఎల్ టెర్మినల్ నిర్మాణం కూడా దాదాపు పూర్తి కావొచ్చింది. బీపీసీఎల్ టెర్మినల్‌కు.. ఏపీలోని కృష్ణపట్నం(నెల్లూరు) నుంచి దండుమల్కాపురం వరకు 423 కిలో మీటర్ల మేర పైపులైన్లను వేసి ఇంధనాన్ని సరఫరా చేస్తారు. కృష్ణపట్నంకు ఓడరేవుల ద్వారా ఇంధనాన్ని తీసుకొస్తారు. కృష్ణపట్నం, ఒంగోలు, గుంటూరు, నల్గొండ, మునుగోడు మీదుగా దండుమల్కాపురానికి పైపులైన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో బీపీసీఎల్ టెర్మినల్ నిర్మాణ ప్రాంతంలో కూడా పనులు ప్రారంభించే అవకాశం ఉంది. దేశంలోనే ఇంధన రంగంలో అతి పెద్ద సంస్థలైన ఐవోసీఎల్, బీపీసీఎల్‌ల టెర్మినళ్లను ఇక్కడ నిర్మిస్తుండటంతో దండుమల్కాపురం ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది.

ప్రయోజనాలివే..!

పెరుగుతున్న వాహనాలను దృష్టిలో పెట్టుకొని డిమాండ్ మేరకు ఇంధనాన్ని నిల్వ చేయవచ్చు. ప్రస్తుతం పెట్రోల్ బంకుల్లో ఏర్పడుతున్న ఇంధనం కొరతను ఇలా నివారించవచ్చు.

పైపులైన్ల ద్వారా సరఫరా అవుతుంది కనుక రవాణా ఛార్జీలు, వాహనాల రద్దీ, కాలుష్యం తగ్గుతుంది. టెక్నికల్ ఉద్యోగాలకు ఎక్కువ అవకాశాలున్నా.. స్థానికులకు కూడా ఉపాధి లభించనుంది.

గ్రామ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి.

# ఆన్‌లైన్‌లో మమ.. అంతంతే జమ

మునుగోడు : మార్చి 3న మునుగోడు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ అనుమతి కోసం గ్రామ పంచాయతీకి వెళ్తే ..ఆన్‌లైన్ అనుమతి పేరుతో అతని వద్ద రూ.42 వేలను తీసుకున్నారు. కానీ ప్రభుత్వ ఖాతాలో రూ.11,972ను జమ చేసి చూపించారు. గతేడాది ఏప్రిల్ 25న మరో వ్యక్తికి గ్రామ పంచాయతీ రికార్డులో నమోదు చేస్తామని చెప్పి ఇంటి స్థల కొనుగోలు దస్తావేజు ఆధారంగా అతని వద్ద యూపీఐ స్కానర్ ద్వారా రూ.16,500 నగదు తీసుకున్నారు. ప్రభుత్వ ఖాతాలో రూ.3336 జమ అయింది.

గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నా ఆన్‌లైన్ ద్వారా తీసుకునే విధంగా.. గత ప్రభుత్వం ఈ–పంచాయతీ వ్యవస్థని తీసుకువచ్చింది. అయితే దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమ సంపాదనపై దృష్టి పెట్టారు. ఈ పంచాయతీలో ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్లో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతుల కోసం ఇచ్చే నగదును స్కానర్ ద్వారా చెల్లించాలి. కానీ తీసుకునే నగదుకు, చెల్లించే దానికి పొంతన కుదరడం లేదు. ఇలా వందల సంఖ్యలో అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకోని రూ.లక్షల్లో దోచుకొని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది.

డిజిటల్ పేరుతో దోచేస్తున్నారు...

నల్గొండ జిల్లా మునుగోడు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం వెళ్తే ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీల పేరిట యూపీఐ స్కానర్ ద్వారా నగదును చెల్లిస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. అంతర్జాలం ద్వారా స్కానర్ చూపిస్తుండటంతో అది నిజమేనని నమ్మి లబ్ధిదారులు డబ్బులు చెల్లించి అనుమతి పత్రాలు పొందుతున్నారు. అయితే వీరు చెల్లించే నగదు, ప్రభుత్వ ఖజానాలో జమయ్యే దాంట్లో చాలా తేడాలు కనిపిస్తున్నాయి. ఇలా అనుమతి పొందిన వారి వివరాలను 'న్యూస్‌టుడే' సేకరించి పరిశీలించగా.. విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిబంధనలు అతిక్రమించి డిజిటల్ లావాదేవీలకు సొంత ఖాతా యూపీఏ స్కానర్‌ను జత చేసి నగదు తీసుకున్నట్లు తెలిసింది. దీంతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములకు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు. ఇలా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం: నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్, నల్గొండ

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే సహించే ప్రసక్తే లేదు. ఆ గ్రామ పంచాయతీకి సంబంధించి వెంటనే విచారణకు ఆదేశాలు జారీ చేస్తాం. తప్పు చేసినట్లుగా నిర్ధారణ అయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# నోటమాట రావడం లేదు!

హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలో టమాట ధరలు అమాంతం పెరిగాయి. రెండ్రోజులుగా మార్కెట్లో కిలో ధర రూ.100కి చేరుకోవడంతో ప్రజలు వాటిని కొనడానికి ఆసక్తి చూపడం లేదు. మార్కెట్లో డిమాండ్‌కు సరిపడా దిగుబడులు లేక ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. నెల రోజుల క్రితం కిలో టమాట రూ.20 నుంచి రూ.30 పలుకగా.. ఆ తర్వాత రూ.40 నుంచి రూ.50లకు చేరుకుంది. అనంతరం అయిదు రోజుల క్రితం ఒక్కసారిగా హోల్‌సేల్‌లో రూ.80.. రిటైల్‌లో రూ.100కు ధర చేరడంతో ప్రజలు నోటమాట రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు 620 ఎకరాల్లో సాగయ్యే టమాట ఇప్పుడు వంద ఎకరాల్లో సాగవుతోంది. ధరల హెచ్చు తగ్గులతో రైతులు ఆసక్తి చూపకపోవడంతో స్థానికంగా కొరత ఏర్పడుతోంది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాపారులు టమాట దిగుమతి చేసుకుంటు



న్నారు. అక్కడ 25 కిలోల ఒక్కో బాక్స్‌ను ఏకంగా రూ.1,850 చొప్పున అమ్ముతున్నారు. రవాణా తదితర ఛార్జీలు కలిపి ఇక్కడి మార్కెట్లో కిలో రూ.100 చొప్పున విక్రయించాల్సి వస్తుందని వ్యాపారులు అంటున్నారు. ధర పెరగడంతో వ్యాపారులు టమాట దిగుమతిని సగానికి పైగా తగ్గించేశారు. గతేడాది వేసవిలో కిలో రూ.200 ధర పలికిన విషయం తెలిసిందే. కాగా దిగుబడులు తగ్గడంతో ఒక్కో బాక్స్ ధర రూ.3,000 పెరిగే అవకాశముందని.. ఇలాగైతే కిలో రూ.200 పైనే అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కసారిగా ధరలు పెరగడంతో టమాట సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్థానికంగా టమాట తోటల పెంపకంపై రైతులకు సరైన ప్రోత్సాహం లభించక, ఉద్యాన శాఖ సైతం నిర్లిప్తంగా వ్యవహరించడం వల్ల సాగు తగ్గుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దిగుమతుల మీద ఆధారపడటమే ధరల పెరుగుదలకు కారణమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# అత్యవసరమైతే పరుగులే!

మెట్‌పల్లి: అత్యవసర పరిస్థితుల్లో చికిత్స కోసం రక్తం ఎంత అవసరమో మనందరికీ తెలుసు. సకాలంలో రక్తం అందితే రోగి ప్రాణాలు కాపాడవచ్చు. సరైన సమయానికి రక్తమందక ప్రాణాలు కూడా పోయే పరిస్థితి తలెత్తుతోంది. ఒక్కోసారి రక్తం కోసం బాధిత కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అలాంటి సమయంలో ప్రాణాలు కాపాడేందుకు రక్త నిల్వ కేంద్రాలు దోహద పడతాయి. జిల్లాలో జగిత్యాలలో తప్ప ఎక్కడా కూడా ప్రభుత్వ రక్త కేంద్రాలు లేవు. ఎక్కువగా రోగుల తాకిడి ఉండే మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో కూడా రక్త నిల్వ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సి వస్తోంది.

మెట్‌పల్లి, కోరుట్ల ఆసుపత్రులకు వివిధ రకాల చికిత్స నిమిత్తం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. గర్భిణులు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ప్రసవాలు చాలానే జరుగుతాయి. మెట్‌పల్లిలో ఏటా సుమారు 2 వేల వరకు జరుగుతుండగా, కోరుట్లలో కూడా ఇంచుమించు ఎక్కువగానే జరుగుతాయి. వీరిలో రక్తహీనత ఉన్న వారికి కొన్ని



సందర్భాల్లో రక్తం అవసరముంటుంది. అలాగే ఈ రెండు పట్టణాల గుండా జాతీయ రహదారి ఉంది. జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాలతో పాటు చుట్టుపక్కల మండలాల్లో జరిగిన ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులను ఈ ఆసుపత్రులకు తీసుకొస్తుంటారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారికి తీవ్ర రక్తస్రావం జరిగిన సమయంలో వెంటనే రక్తం ఎక్కించాల్సిన అవసరముంటుంది. అంతే కాకుండా క్యాన్సర్, తలసేమియా బాధితులకు రక్తం ఎక్కించాలి. అలాగే ఇతర శస్త్రచికిత్సల కోసం వచ్చే వారుంటారు. వారికి రక్తం అవసరం పడుతోంది. ఈ క్రమంలో రక్త నిల్వ కేంద్రాలు లేకపోవడంతో జిల్లా కేంద్రానికి వైద్యులు రిఫర్ చేస్తున్నారు. జగిత్యాల నుంచి అవసరమైన రక్తం తెప్పించి రోగులకు ఎక్కిస్తున్నారు.

పరికరాలు వచ్చినా..మెట్‌పల్లి ఆసుపత్రికి గతంలో రక్త నిల్వ కేంద్రం మంజూరైంది. రిఫ్రిజిరేటర్, మైక్రోస్కోప్ తదితర పరికరాలు వచ్చినా సరిపడా గదులు లేక వినియోగించడం లేదు. ప్రస్తుతం కొత్త భవన నిర్మాణంలో ఉండగా, అందుబాటులోకి వచ్చిన తర్వాత వినియోగం లోకి తెస్తామని స్థానిక వైద్యులు చెబుతున్నారు. కోరుట్లలో వంద పడకల ఆసుపత్రి అయినప్పటికీ రక్త నిల్వ కేంద్రం మంజూరు కాలేదు. మెట్‌పల్లి, కోరుట్ల ఆసుపత్రుల్లో రక్త నిల్వ కేంద్రాలు ఉంటే జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వ్యయ, ప్రయాసలు తప్పడంతో పాటు అన్ని గ్రూపుల రక్తం స్థానికంగా అందుబాటులో ఉండే అవకాశముంటుంది. దీనివల్ల అవసరమైన వారికి సకాలంలో రక్తం ఎక్కించవచ్చు. అలాగే ఈ ప్రాంతంలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రక్తదానంలో ముందుంటున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం నిల్వ ఉంచడం వల్ల స్థానికులకు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# హైదరాబాద్‌లో.. బాబోయ్ ఇదేం ట్రాఫిక్!



హైదరాబాద్: రోడ్డెక్కితే గమ్యం చేరేందుకు వాహనదారులు నరకం చవిచూస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాఫిక్ సమస్యతో విసుగెత్తి పోతున్నారు. అర కిలోమీటరు దూరానికి అరగంట వెచ్చించాల్సి వస్తోంది. కీలకమైన సమయంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు కనిపించడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్‌ను బదిలీ చేశారు. ఇన్‌ఛార్జిపై అదనపు బాధ్యతలు పడటంతో పర్యవేక్షణ భారంగా మారింది. మూడు నెలలుగా కీలకమైన అధికారి పోస్టు ఖాళీగా ఉంది. మారుతున్న అవసరాలకు తగినట్టుగా ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని పెంచక పోవటంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమస్యగా మారింది.

25 లక్షల వాహనాలు..:

గ్రేటర్‌లో నిత్యం 25 లక్షల వాహనాలు రోడ్లమీదకు వస్తుంటాయని అంచనా. గతంతో పోల్చితే ఈ సంఖ్య 20 శాతం పెరిగినట్టు ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇటీవల ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రాకపోకలు పెరగటంతో, వాహనాల సంఖ్య రెట్టింపునకు చేరింది. ప్రముఖుల పర్యటనలు, ప్రొటోకాల్ అమలుతో తరచూ ట్రాఫిక్‌ను నిలిపివేయాల్సి వస్తోంది. విద్యా సంవత్సరంమొదలవడంతో పాఠశాల ల బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఆటోలు మళ్లీ రోడ్డెక్కాయి. ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించే ప్రైవేటు బస్సులు, లారీలు, భారీ వాహనాలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. గతంలో నిబంధనలు పాటించని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకునేవారు. ప్రస్తుతం చలానాలకే పరిమితం కావటంతో ప్రైవేటు వాహనదారులు తేలికగా తీసుకుంటున్నారు. ఈ ఏడాది 5 నెలల వ్యవధిలోనే మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 40 లక్షల కేసులు నమోదయ్యాయి.

మొరాయిస్తున్న బండ్లు..నగరం, శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం రోడ్లకు ఇరువైపులా వాహనాలు నిలపటం. కీలకమైన ఎల్బీనగర్, నాగోల్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, తార్నాక, అబిడ్స్, నారాయణగూడ,చాదర్‌ఘాట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్ మార్గాల్లో.. వేలాది వాహనాలు రోడ్లకు ఇరువైపులా నిలిపి ఉంటున్నాయి. 3 కమిషనరేట్ల పరిధిలో రోజూ సగటున 20వాహనాలు ఇంధనంలేక, మరమ్మతులకు గురై మొరాయిస్తున్నాయి. రద్దీ ప్రాంతాలు, పై వంతెనలపై వీటిని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు 1-2 గంటలు వెచ్చించాల్సి వస్తోంది. చీకటి పడితే చాలు ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు ప్రయాణికులను తీసుకెళ్లే ప్రైవేటు బస్సులు మియాపూర్, కేపీహెచ్‌బీ, ఎస్సార్‌నగర్, అమీర్‌పేట, లక్డీకాపూల్, అబిడ్స్, కాచిగూడ, మెహిదీపట్నం, అత్తాపూర్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్ ప్రాంతాల్లో గంటల తరబడి నిలపటంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. రాత్రి 7 నుంచి అర్ధరాత్రి వరకూ తోపుడుబండ్లు, ద్విచక్ర వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు.

# ఆస్పత్రుల్లో భద్రత ప్రశ్నార్థకం!



కరీంనగర్ : రోగులకు చికిత్స అందించే ఆస్పత్రుల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు.. అనారోగ్యమని ఆస్పత్రుల మెట్లు ఎక్కేవారి భద్రత ప్రశ్నార్థకమవుతోంది.. గత నెలలో దిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం జరిగినప్పటికీ ఉమ్మడి జిల్లాలో భద్రతా లోపాల్ని సవరించుకోవడం లేదు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు రేగిన ఘటన మరోసారి భద్రతను ప్రశ్నార్థకం చేసింది.. నాలుగు జిల్లాల పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లోని వసతుల తీరుపై గతేడాది అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,186 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నట్లు అప్పట్లో గుర్తించారు. దాదాపు 80 శాతం ఆస్పత్రుల్లో ఏదో ఒక లోపముందని గుర్తించిన అధికారులు 20 శాతం దవాఖానాలకు తాఖీదులు అందించారు. కానీ ఇప్పటి వరకు మళ్లీ ఆ ఆస్పత్రుల జోలికి వెళ్లిన దాఖలాలు లేవు.

నిర్వహణ మొక్కుబడిగానే..

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉపకరణాల ఏర్పాటు, నిర్వహణ విషయంలో చాలా యాజమాన్యాలు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయి. భవనం అనుమతుల నుంచి అడుగడుగునా నిబంధనల అతిక్రమణలే ఉంటున్నాయి. పర్యవేక్షణ అధికారుల్ని మచ్చిక చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా వైద్యారోగ్యశాఖతోపాటు పుర, నగరపాలక సంస్థలు, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు శాఖ ఇలా పలు శాఖల నిరంతర పర్యవేక్షణ ఆస్పత్రులపై ఉండాలి. అగ్నిమాపక శాఖ వారు ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా.. పని చేస్తున్నాయా పరిశీలించాలి. విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తు ఉపకరణాలు నాణ్యమైనవే వాడుతున్నారా.. వారు అనుమతి తీసుకున్న కెపాసిటీ మేరకే వినియోగిస్తున్నారా.. వైరింగ్ ఎలా ఉంది తదితర విషయాలు పరిశీలించాలి. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు, జనరేటర్, విద్యుత్తు ఉపకరణాలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశముంటుంది. ఇవన్నీ సరిగా ఉన్నాయా లేదా క్రమం తప్పకుండా ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతుందన్న ఆరోపణలున్నాయి. పైగా ఆస్పత్రిలో ఏ ఉపకరణాల్ని వాడుతున్నారనే విషయంలో లెక్కాపత్రం లేదని వైద్యఆరోగ్యశాఖకు చెందిన ఓ అధికారి చెప్పడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే ఆస్పత్రులపై దృష్టి పెట్టి భద్రత విషయంలో చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలు మున్ముందు జరగకుండా ఉండే అవకాశం ఉంది. ఈ విషయమై జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్నను సంప్రదించగా ప్రతి ఆసుపత్రిలో భద్రత ప్రమాణాలు పాటించడం యాజమాన్యాల బాధ్యత అన్నారు. తాము పలుమార్లు అవగాహన కల్పించామని, తనిఖీలు చేశామని.. నిబంధనల మేరకు లేని వాటికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. మరోసారి అన్ని ఆస్పత్రులపై దృష్టి సారించి సూచనలు ఇస్తామన్నారు.

ప్రైవేటు దవాఖానాలో చెలరేగిన మంటలు

కరీంనగర్‌లో గాయత్రి ఆసుపత్రిలోని ఒక గదిలో మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఆసుపత్రి రెండో అంతస్తులో చికిత్స పొందేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏసీ గది నుంచి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గదిలో రోగులు లేరు. మంటలతో వ్యాపించిన పొగలను గుర్తించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. పక్క గదుల్లో చికిత్స పొందుతున్న అయిదుగురు రోగులను మరో ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాపించకుండా విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, అదనపు డీఎఫ్‌వో ప్రభాకర్, కరీంనగర్ అగ్నిమాపక కేంద్ర అధికారి పరమేశ్వర్ ఆసుపత్రి యాజమాన్యం నుంచి వివరాలు సేకరించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు అధికారి వెంకన్న తెలిపారు. నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు వైద్యులు రంజిత్‌కుమార్, మేఘనరావు తెలిపారు.

# బాలికలకు వరం.. మినీ గురుకులం

ధర్మారం: గిరిజన ఆవాసాల్లో బాలికల అక్షరాస్యతను పెంచేందుకు 1999-2000 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గురుకులాలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు గిరిజన గురుకులాల్లో ధర్మారం పాఠశాల ఒకటి. మండలంలో మూడు పంచాయతీలతో పాటు కొత్తూరు, కొత్తపల్లి గ్రామాల్లో ఎస్టీ జనాభా ఎక్కువగా ఉండటంతో మండలకేంద్రంలో మినీ గిరిజన గురుకులం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక్కో తరగతికి 30 మంది చొప్పున అయిదు తరగతుల్లో 150 మంది చదువుకొనే వీలుంది. అయిదేళ్ల కిందటి వరకు ధర్మారంలోని పాతబస్టాండు ప్రాంతంలోని ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకొని నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం ఉన్న స్థానిక జక్కన్నపల్లిలోని సొంత భవనంలోకి మారింది. పూర్తి స్థాయిలో వసతులు ధర్మారం మండలకేంద్రంలోని జక్కన్నపల్లి వద్ద కరీంనగర్-రాయపట్నం రహదారి పక్కన గురుకులానికి సొంత భవనం ఉంది. విద్యార్థులకు సరిపడా స్నానాల గదులు, సామూహిక మరుగుదొడ్లు, ఆట స్థలం ఉన్నాయి. స్నానాలకు వేడి నీటి వసతి ఉంది. శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నారు. అయిదుగురు ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, పీఈటీ ఉన్నారు. మెనూ ప్రకారం భోజనాలతో పాటు పడుకునేందుకు సరిపడా మంచాలున్నాయి. కంప్యూటరు విజ్ఞానాన్ని అందిస్తున్నారు. పాఠశాల ఆవరణలో బాలికలు ఆడుకునేందుకు వీలుగా జారుడు బల్ల, తిరుగుడు కుర్చీలు, ఊయలలు ఆట పరికరాలున్నాయి. సద్వినియోగం చేసుకోవాలిచిన్నారులు అసౌకర్యానికి గురి కాకుండా అన్ని వసతులున్నాయి. ఈ విషయమై తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రవేశాలు పెంచుతున్నాం. కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నాం. ధర్మారంతో పాటు పరిసర మండలాల చిన్నారులనూ చేర్చుకుంటాం.

# బడ్జెట్‌ను మెట్రో అందుకునేనా?

హైదరాబాద్: మెట్రో రైలు విస్తరణ సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)కు మరింత సమయం పడుతుందా? అవుననే అంటున్నాయి మెట్రోరైలు వర్గాలు. ప్రభుత్వం మెట్రో విస్తరణపై సమీక్ష నిర్వహించే నాటికి తుది నివేదిక సిద్ధమవుతుందని చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అనంతరం సర్కారు దృష్టి అంతా రైతు రుణమాఫీ, రైతు భరోసాపై ఉండటంతో మెట్రో వంటి ఇతర అంశాలపై సమీక్షించే అవకాశం రాలేదు. హైదరాబాద్‌లో రెండోదశలో 70 కి.మీ. మేర మెట్రోని విస్తరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి డీపీఆర్ రూపకల్పనకు ఆదేశించింది. రాయదుర్గం నుంచి నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వరకు, నాగోల్-ఎల్బీనగర్-చంద్రాయణగుట్ట- జల్‌పల్లి-పీ7 రోడ్, శంషాబాద్ విమానాశ్రయం, ఇదే మార్గం అరాంఘర్, కొత్త హైకోర్ట్ వరకు, మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, చంద్రాయణగుట్ట వరకు రెండోదశలో విస్తరణకు మార్గాలను సర్కారు ఎంపిక చేసింది. రెండు కన్సల్టెన్సీలకు ఈ బాధ్యతలు అప్పగించారు. డీపీఆర్ కోసం ఈ మార్గాల్లో మట్టి నమూనా పరీక్షలు, ట్రాఫిక్, ఇతరత్రా సర్వేలను పూర్తి చేసి ప్రాథమిక సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేసే పనిలో ఉన్నారు. సీఎం సమీక్ష అనంతరం మార్పులు, చేర్పుల



అనంతరం తుది నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలిపితే నిధుల సాయానికి కేంద్రానికి పంపనున్నారు.

ఎంతిస్తారు? ప్రాజెక్ట్ వ్యయంలో ఈక్విటీలో కేంద్రం తోడ్పాటు 15 శాతం, రాష్ట్రం 35 శాతం నిధులు వెచ్చిస్తుంది. చేరి సగం కూడా భరించే అవకాశం ఉంది. మిగిలిన 50 శాతానికి రుణాలు తీసుకుంటారు. ఇందులో ఒక 5 శాతం ప్రైవేటు భాగస్వామ్యం పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయి.

కేంద్ర బడ్జెట్ అనంతరమే..

వచ్చే నెలలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై కేంద్రం ఇప్పటికే కసరత్తు మొదలెట్టింది. మెట్రో విస్తరణకు నిధులు ఇవ్వాలని సర్కారు గతంలోనే కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. విస్తరణ డీపీఆర్‌ను సిద్ధం చేసి పంపిస్తామని చెప్పింది. ఇప్పటివరకు రాష్ట్రమే ఇంకా డీపీఆర్‌కు ఆమోద ముద్ర వేయలేదు. దీనికి మరో నెల రోజులు సమయం పట్టేలా ఉంది. కాబట్టి బడ్జెట్‌తో సంబంధం లేకుండా కేంద్రాన్ని మెట్రోకి నిధులను కోరే అవకాశం ఉంది.

# సంక్షోభంలో.. సంక్షేమం!

భువనగిరి : ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణ అధ్వానంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12 నుంచి ప్రభుత్వ వసతి గృహాలు ప్రారంభమైనప్పటికీ ఆయా వసతి గృహాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పన పూర్తి స్థాయిలో జరగకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, కళాశాల వసతి గృహాలతో పాటు గురుకులాలు పనిచేస్తున్నాయి. సదుపాయాలు కారణంగా ఏటేటా ప్రవేశాల సంఖ్య తగ్గుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన కొన్ని వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకుని మూత పడటం గమనార్హం.

నిర్వహణ లోపాలు ఇలా...

జిల్లా పరిధిలోని అత్యధిక వార్డెన్ పోస్టుల్లో ఇన్‌ఛార్జులు కొనసాగుతున్నారు. ఎస్సీ గురుకులాలో ఇన్‌ఛార్జి వార్డెన్లుగా(కేర్‌టేకర్) ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మూడు ప్రిన్సిపల్ పోస్టుల్లో ఇన్‌ఛార్జులు పనిచేస్తున్నారు. దీంతో వసతి గృహాల నిర్వహణపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. నిర్వహణ లోపాల ఆరోపణలతో గత విద్యాసంవత్సరం గురుకులాల్లో, వసతి గృహాల్లో విద్యార్థులు మరణాలు నమోదయ్యాయి.

దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలేరు, రామన్నపేట, భువనగిరిలోని ఎస్సీ వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలేరులో పక్కనే ఉన్న భవనంలో గృహాన్ని నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అత్యధిక వసతి గృహాల్లో విద్యుత్తు, నీటి సరఫరా, మరుగుదొడ్ల సమస్యలు నెలకొన్నాయి. భువనగిరి ఎస్సీ గురుకుల పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడుతోంది. రెండేళ్ల క్రితం ప్రారంభించిన డార్మిటరీ అసంపూర్తిగా



నిలిచింది. తరగతి గదులు, ల్యాబ్‌ల నిర్వహణకు సరిపడా గదులు లేవు. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు లీకవుతోంది.

బీసీ వసతి గృహాల్లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. మైనార్టీ గురుకులాలు అన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అన్నింట్లో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు. మూడు ఎస్టీ వసతి గృహాలు ఇన్‌ఛార్జిల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. భువనగిరి ఎల్లమ్మగుడి వద్ద ఉన్న వసతి గృహంలో డ్రైనేజీ సమస్య, తారకరామానగర్ వసతి గృహంలో నీటి వసతి లేదు. పగిడిపల్లి వసతి గృహంలో మరో నాలుగు తరగతి గదులు నిర్మించాల్సి ఉంది.

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం వసతి గృహాల్లో చేపట్టాల్సిన మరమ్మతులు, నిర్మాణాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ, మైనార్టీ సంక్షేమ ఇన్‌ఛార్జి అధికారి యాదయ్య వివరణ ఇచ్చారు. కొత్తగా వార్డెన్లు నియమితులయిన పక్షంలో ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అద్దె భవనాల్లో అంతగా సమస్యలు లేవని స్పష్టం చేశారు. కొత్తగా నియామకాలు జరిగేంత వరకు ఇన్‌ఛార్జిలతోనే నిర్వహణ కొనసాగిస్తామని గురుకులాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ రజని తెలిపారు. విద్యార్థుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

## అందాల దివి సైడ్ అదిరింది

తెలుగు బిగ్ బాస్ ద్వారా మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ దివి. ఈ అమ్మడు తెలుగు లో వరుసగా సినిమాలు చేస్తూ వెబ్ సిరీస్ ల్లో నటిస్తూ ఉందడి చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతూ ఉంది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ గతంలోనే పలు ఫోటో షూట్స్ నిరూపించాయి.

చీర కట్టు లో మోడ్రన్ డ్రెస్ ల్లో కూడా అందాల దివి చూపు తిప్పుకోనివ్వని అందం కలిగి ఉందని నెటిజన్స్ కామెంట్స్



చేయడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోసారి ఈ అమ్మడు సోషల్ మీడియాలో సందడి చేసింది. ఈసారి సైడ్ యాంగిల్ పిక్స్ తో కవ్వించింది. నడుము అందంను చూపిస్తూ, కనిపించి కనిపించకుండా నడుము చూపిస్తూ ఆకట్టుకున్న ఈ అమ్మడు బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి ఏమాత్రం తీసి పోవడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అందాల దివి కి యంగ్ స్టార్ హీరోలతో నటించేంత అందం మరియు ప్రతిభ ఉన్నాయి. అయినా కూడా దివికి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. ముందు ముందు అయినా దివి హీరోయిన్ గా బిజీ అవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## చీరకట్టు లో మేడం సార్ మేడం అంతే..!

జబర్దస్త్ షో ద్వారా తెలుగు బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయిన యాంకర్ అనసూయ, ఆ తర్వాత పలు సినిమాల్లో నటించడం ద్వారా వెండి తెరపై మెరిసింది. ముఖ్యంగా ఈమె రంగస్థలం సినిమాలో పోషించిన రంగమ్మత్త పాత్రకు మంచి పాపులారిటీ దక్కడంతో టాలీవుడ్ లో మోస్ట్ బిజీ నటిగా మారింది. ఇద్దరు పిల్లలు ఉన్నా కూడా అనసూయ పడుచు అమ్మాయిలకు పోటీ అన్నట్లుగా అందంగా ఉంటుంది అనడంలో సందేహం లేదు. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలు చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఎరుపు రంగు చీర కట్టు లో నడుము చూపించి చూపించకుండా, సింపుల్ అండ్ స్వీట్ మేకప్ తో




భలే ఉందే అనిపించే విధంగా అనసూయ కన్నుల విందు చేస్తుంది. ఈ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అనసూయ మరోసారి అందం విషయంలో వార్తల్లో నిలిచింది. గతంలో జబర్దస్త్ చేసే సమయంలో ప్రతి వారం అందాల ఫోటోల షూట్ ఫోటోలను షేర్ చేసిన అనసూయ ఈ మధ్య కాలంలో తగ్గించడంతో అభిమానులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా రెగ్యులర్ గా అందమైన ఫోటోలను షేర్ చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇలాంటి ఫోటోలను చూస్తూ ఫ్యాన్స్ మరియు నెటిజన్స్ మేడం సార్ మేడం అంతే అన్నట్లుగా అల్లు అర్జున్ డైలాగ్ ను కామెంట్ చేస్తూ అనసూయ పై తమ అభిమానంను ప్రదర్శిస్తున్నారు. ఈ స్థాయి అందంగా ఉన్న అనసూయ ప్రస్తుతం పుష్ప 2 సినిమాలో కీలక పాత్రలో నటిస్తుంది.

ముందు ముందు లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో హీరోయిన్ గా కూడా నటించాలని ఫ్యాన్స్ కొందరు కోరుకుంటున్నారు. చాలా మంది టాలీవుడ్ హీరోయిన్స్ తో పోల్చితే అనసూయ చాలా అందంగా ఉన్నారు అనేది చాలా మంది అభిప్రాయం.

సినిమా 'షో'

# ఎన్టీఆర్ 'వార్' కి ఆ సరికొత్త టెక్నాలజీ!




యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమాతో పాటు బాలీవుడ్ లో వార్ 2 సినిమాలో కూడా నటిస్తున్న విషయం తెల్సిందే. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటికే ఫారిన్ షెడ్యూల్ తో పాటు ముంబై షెడ్యూల్ ను పూర్తి చేసిన దర్శకుడు అయాన్ ముఖర్జీ కొత్త షెడ్యూల్ కి రెడీ అవుతున్నాడు. ఇద్దరు హీరోల డేట్లు ఒకే సారి లభించడం అనేది కాస్త కష్టంగా కూడుకున్న విషయం. అందుకే సరికొత్త టెక్నాలజీని ఈ సినిమా కోసం వినియోగిస్తున్నారట. బాలీవుడ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఫేస్ స్వాపింగ్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా హీరోలు ఇద్దరు కూడా ఎక్కువ కష్టపడకుండానే షూటింగ్ సాగుతుందని అంటున్నారు. యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ఇద్దరు హీరోల బాడీ డబుల్ ప్లాన్ చేశారు. మొదట యాక్షన్ ఎపిసోడ్స్ ను హీరోల బాడీ డబుల్ తో షూట్ చేస్తారు. ఆ తర్వాత ఫేస్ స్వాపింగ్ టెక్నాలజీని ఉపయోగించి హీరోల ఫేస్ లను అద్దబోతున్నారట.

ఇప్పటికే బాలీవుడ్ తో పాటు సౌత్ లో కొన్ని సినిమాలకు ఈ టెక్నాలజీని వాడినట్లు తెలుస్తోంది. వార్ 2 కోసం మాత్రం ఇప్పటి వరకు ఏ సినిమాకు ఉపయోగించనంతగా ఈ టెక్నాలజీని వినియోగించబోతున్నారు. కనీసం డౌట్ రాకుండా, నూటికి నూరు శాతం సహజంగా ఉండే విధంగా ఈ టెక్నాలజీని విదేశీ నైపుణ్యం ఉన్న వారితో చేయించబోతున్నారట. వచ్చే ఏడాదిలో వార్ 2 ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.


# ఎలెవెన్ టీజర్.. నవీన్ చంద్ర థ్రిల్లర్ ఇన్వెస్టిగేషన్




హీరో నవీన్ చంద్ర ప్రస్తుతం వైవిధ్యమైన పాత్రలతో, కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇటీవలే "ఇన్‌స్పెక్టర్ రిషి" అనే వెబ్ సిరీస్‌తో పాటు సత్యభామ సినిమాలో కనిపించి మంచి క్రేజ్ అందుకున్నాడు. ఇక ఇప్పుడు తన కొత్త బైలింగువల్ మూవీ "ఎలెవెన్" తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రైం మిస్టరీ థ్రిల్లర్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. తాజాగా "ఎలెవెన్" చిత్రంలోని టీజర్ విడుదల చేశారు. ఈ టీజర్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. టీజర్ మొదట్లోనే నవీన్ చంద్ర చెప్పే "రంజిత్ లాంటి ప్రతిభ ఉన్న పోలీసు ఆఫీసరే ఈ కేసును ఎందుకు ఛేదించలేకపోయారో ఇప్పుడు అర్థమవుతుంది.. ఫింగర్ ప్రింట్స్ లేవు, సీసీటీవీ ఫుటేజ్ లేదు.. కనీసం జుట్టు ఆనవాళ్లు కూడా లేవు" అనే డైలాగ్ టీజర్ యొక్క సీరియస్ టోన్ ని సెట్ చేస్తుంది. ఈ డైలాగ్ తోనే కేసు క్లూ లేని కష్టతరమైన ఇన్వెస్టిగేషన్ అనే విషయాన్ని స్పష్టం చేస్తుంది. నవీన్ చంద్ర ఈ సినిమాలో ఒక సీరియస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తున్నారు. అసలు ఆధారాలు లేని ఓ కేసును ఛేదించడమే ఈ సినిమా కథ అని టీజర్ చూసిన వారందరికీ అర్థమయ్యేలా ఉంది. టీజర్ మధ్యలో "ఎలుకను తిన్న పాముకు తెలియదు.. దాన్ని తినడానికి గద్ద ఒకటి వస్తుంది" అనే డైలాగ్ నవీన్ చంద్ర చెబుతారు. ఈ డైలాగ్ నిందితులను ఉద్దేశించినట్టు ఉంటుందని, కేసులో నలుగుతున్న ఆ సీరియస్ దృశ్యాన్ని ఆకట్టుకునేలా చూపిస్తారు. టీజర్ మొత్తం సస్పెన్స్, థ్రిల్, యాక్షన్ సీక్వెన్సులతో నిండి ఉంది. ఈ టీజర్ ప్రేక్షకులలో ఆసక్తి రేకెత్తిస్తుంది. నవీన్ చంద్ర తన నటనతో మరోసారి ప్రేక్షకులను మెప్పించారు. ఎలాంటి పాత్రలో అయినా అతని సరికొత్తగా కనిపిస్తాడని అర్థమవుతుంది. ఈ సినిమాలో రేయా హరి, శశాంక్ అభిరామి, దిలీపన్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమిళ దర్శకుడు లోకేష్ అజ్లిస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రైం ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగుతున్న ఈ టీజర్ ప్రేక్షకులలో సినిమాపై ఆసక్తిని పెంచింది. నవీన్ చంద్ర తన ప్రతిభతో, ఆసక్తికరమైన కథలతో ఎప్పటికప్పుడు తన అభిమానులను అలరిస్తున్నారు. "ఎలెవెన్" చిత్రం కూడా విభిన్నంగా ఉందనున్నట్లు తెలుస్తోంది. మరి ఈ సినిమాతో అతను ఎలాంటి గుర్తింపు అందుకుంటారో చూడాలి.

## సవాళ్లు..విలన్లే ఇష్టం..కానీ నేనేమో అలా!

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కెళ్లి సక్సెస్ అయిన కృతి సనన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. %-%వన్%-% తో తెలుగులో లాంచ్ అయిన అమ్మడు అటుపై రెండు, మూడు సినిమాలు చేసి ముంబైకె ళ్లిపోయింది. అక్కడ మాత్రం బాగానే కలిసొచ్చింది. వరుస విజయాలతో వేగంగా స్టార్ లీగ్ లో చేరింది. అటుపై జాతీయ ఉత్తమ నటిగానూ అవార్డు..రివార్డు అందుకుంది. దీంతో అమ్మడి రేంజ్ అంతకంతకు రెట్టింపు అయింది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలకు సైతం ప్రమోట్ అయింది. ఈ నేపథ్యంలో కృతి సనన్ మనసులో దాచేసిన ఎన్నో ఎమోషన్స్ ని సైతం బయట పెట్టే ప్రయత్నం చేసింది. బాలీవుడ్ ఇండస్ట్రీ తీరుపై తీవ్ర అసహనాన్ని సైతం వ్యక్తం చేసింది. అవకాశాల పట్ల హీరోయిన్లు ఎంతగా ఇబ్బంది పడతారు? అనే అంశాన్ని లేవనెత్తింది. మేల్ డామినేషన్ ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది చెప్పే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా



తన కెరీర్ సంబంధించి ఇన్నాళ్లు మనసులో దాచుకున్న భావోద్వేగాన్ని సైతం బయట పెట్టింది. అమ్మడికి హీరోయిన్ పాత్రలు పోషించడం పెద్దగా ఇష్టం ఉండదుట. ఆ పాత్రలో ఏమంత కిక్ ఉండదం టోంది. ఆ పాత్రకంటే విలన్ పాత్రలు, చాలెంజింగ్ రోల్స్ పోషిస్తే బాగుంటుందని, తన మొదటి ఛాయిస్ వేటికి అంటే ఛాలెంజింగ్ రోల్స్ వైపు ఓటు వేసింది. సాఫీగా సాగిపోయే పాత్రలు, ఆడిపాడి పాత్రలు చేస్తే ఎప్పటికీ నటిగా ఎదగలేము అంటోంది. నటిగా ప్రత్యేక గుర్తింపు దక్కాలంటే ఎంపిక చేసుకునే పాత్రలు సైతం అంతే కఠినంగా ఉండాలంటోంది. అలాగే దో పత్తి అనే సినిమాతో కృతి సనన్ నిర్మాత కూడా ప్రయాణం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే.

ఓ నిర్మాతగా తన ప్రమే యం ప్రతీ అంశంలోనూ ఉంటుందిట. ఇప్పటికే కొన్ని విషయాలు తెలుసు కున్నానని, తెలుసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయంది. ఇలా నిర్మాతగా మారడానికి ఓ ప్రత్యేక కారణాన్ని చెప్పుకొచ్చింది. సొంత సినిమా కాబట్టి అన్ని విషయాల్లో కల్పించుకోవచ్చు. ఎవరు అడ్డు చెప్పరు. నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపింది.

## కొత్త లవ్ లైఫ్ గురించి స్టార్ హీరోయిన్

చాలా మంది సెలబ్రిటీల్లానే శృతి హాసన్ కూడా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఈ భామ తన ఫాలోవర్స్ తో కల్మషం దాపరికం లేకుండా నిజాయితీగా అన్ని విషయాలను షేర్ చేస్తుంది. ఇటీవల తన గతం గురించి శ్రుతి ప్రస్తావించింది. ఇందులో తన మాజీ గురించి మాట్లాడుతోందని చాలా మందికి అర్థమైంది. శ్రుతి సోషల్ మీడియా క్యాప్షన్‌లో ఇలా రాసింది. నేను ఎన్నడూ వెనక్కి తిరిగి చూడను కానీ నేను అలా చేసినప్పుడు.. నేను ముందుకు వెళ్లి కోరుకున్నదంతా చేసినందుకు చాలా ఆనందిస్తాను అని వ్యాఖ్యానించింది. శ్రుతి ఎవరి పేరును స్పష్టంగా ప్రస్తావించనప్పటికీ.. శంతనుతో విడిపోయినా దానికి తాను కలత చెందడం లేదని.. తాను చేయాలనుకున్నవి చేశానని చెబుతోందని అర్థమైంది. చెడు కంటితో ఎవరినీ చూడొద్దని అభిమానులను కోరిన శ్రుతి.. ఎవరిని చూసి బాధపడకు.. సంతోషంగా ఉండు. అద్భుతంగా అనిపిస్తుంది! అని తన ఇన్‌స్టాలో షేర్ చేసారు. శృతి హాసన్ ఇటీవల ఆర్టిస్ట్ శంతను హజారికా నుంచి విడిపోయింది. COVID -19 మహమ్మారి సమయంలో డేటింగ్ ప్రారంభించిన ఈ జంట వ్యక్తిగత విభేదాల కారణంగా ఏప్రిల్ 2024లో విడిపోయారు. ఆ తర్వాత శ్రుతి ఏప్రిల్ 16న సోషల్ మీడియాల్లోకి తిరిగి రావడానికి ముందు



ఏప్రిల్‌లో చాలా కాలం పాటు MIA (మిస్సింగ్ ఇన్ యాక్షన్)కి కూడా వెళ్లింది. తిరిగి వచ్చిన తర్వాత తన బ్రేకప్ గురించి వరుస కథనాలను పోస్ట్ చేసింది. ఆ సమయంలో నా జీవితం రీ-కాన్ఫిగరింగ్ చేసే దశలో ఉందని శ్రుతి పేర్కొంది. శ్రుతి తన అనుచరులకు వారు ఎవరూ (మాజీ ప్రియులు) క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. దాదాపు నాలుగేళ్ల పాటు శాంతను హజారికాతో సహజీవనం చేసిన తర్వాత శృతి హాసన్ బంధం ముగిసింది. మూడు నెలల క్రితం ఈ జంట విడిపోయినట్టు కథనాలొచ్చాయి. తాను ఒంటరిగా ఉన్నానని, అయితే ఎవరితోను మింగిల్ అవ్వడానికి ఇంకా సిద్ధంగా లేనని తెలిపింది. గతంలో శ్రుతిహాసన్ హీరో సిద్ధార్థ్ తో డేటింగ్ చేసినా బ్రేకప్ అయింది. ఆ తర్వాత విదేశీ మైఖేల్ కోర్సలేతో ప్రేమలో పడింది. అతడితోను బ్రేకప్ అనంతరం శంతను హజారికతో డేటింగ్ చేసింది. ఇటీవలే ఈ జంట కూడా చివరికి బ్రేకప్ అయింది. సోషల్ మీడియాల్లో శ్రుతి తాజా సందేశం అభిమానుల్లో చర్చగా మారింది. తన పాత పరిచయాలు బ్రేకప్ లతో తాను కలత చెందనని శ్రుతి సందేశం ఇస్తోందా? త్వరలోనే కొత్త లవ్ లైఫ్ కి శ్రీకారం చుడుతుందా? అంటూ అభిమానుల్లో ఆసక్తి మొదలైంది.

